మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 17 అక్టోబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 283 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

అవిభక్త కవలలకు హ్యాపీ బర్త్ డే..

వీణ-వాణీల 24వ పుట్టినరోజు

2

దాండియా డాన్స్ చేసిన రోబో

కలీనగర్ జిల్లా నగునూరు దుర్గాభవానీ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో హ్యూమనాయిడ్ రోబో.. సంప్రదాయ దుస్తుల్లో భక్తులతో కలిసి దాండియా నృత్యం చేసింది.

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

6వ రోజు

సరస్వతీదేవిగా దుర్గమ్మ దర్శనం

బంగారు వీణతో భక్తులకు చదువుల తల్లి సాక్షాత్కారం

హైదరాబాద్, మనం న్యూస్: శరన్నవరాత్రుల్లో భాగంగా 6వ రోజైన నిజ ఆశ్వయుజ శుద్ధ షష్ఠి శుక్రవారంనాడు ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రానికి దసరా శరన్నవరాత్రుల్లో ఎంతో విశిష్టత ఉంది. అందుకే ఆశ్వయుజ శుద్ధ షష్ఠి నాడు చదువుల తల్లిగా కొలువుదీరే దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతారు. త్రిశక్తి స్వరూపిణి నిజస్వరూపాన్ని ...మిగతా 2లో

దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

విజయవాడ, అక్టోబర్ 16 (మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకుని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైన 'సరస్వతీ దేవి' అలంకారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మను ఆయన దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ...మిగతా 2లో

దసరా నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడ ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం నాడు కనకదుర్గమ్మ ఆలయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా సందర్శించారు. చదువుల తల్లి సరస్వతీ దేవి రూపంలో భక్తులకు అభయమిస్తున్న అమ్మవారికి, రాష్ట్ర ప్రజలందరి తరఫున ఆయన పట్టువస్త్రాలు, పండ్లు, పూలు సమర్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని సీఎం కోరారు.

నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక సెషన్

డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసమేనంటూ మీడియా కథనాలు

ఢిల్లీ, అక్టోబర్ 16: ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ...మిగతా 2లో

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాల నిర్వహణ

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

2

అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం తథ్యం

మంత్రి కందుల దుర్గేష్

హైదరాబాద్/ రాజమహేంద్రవరం, అక్టోబర్ 16 (మనంప్రతినిధి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి విజయఢంకా మోగిస్తారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని హుకుంపేట కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ...మిగతా 2లో

మహాశక్తి యాగంలో భక్తిభావంతో కుంకుమార్చనలు

43 కోట్లకు చేరుకున్న కుంకుమార్చన

నేడు వేలాది మంది విద్యార్థులతో మహాసరస్వతీ పూజ

అష్టమి ఆదివారం రోజున ఐశ్వర్య దీప పూజ

18న నవశక్తి హోమం పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్, అక్టోబర్, 16: మహాశక్తి యాగంలో భాగంగా నిర్వహిస్తున్న వంద కోట్ల కుంకుమార్చన కార్యక్రమం ఆరో రోజుకు చేరుకుంది. వేలాది మంది భక్తులు అమ్మవారి సహస్రనామాలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు సుమారు 43 కోట్ల కుంకుమార్చనలు పూర్తయినట్లు పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామివారు వెల్లడించారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే దిశగా భక్తులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాకినాడ శ్రీ పీఠంలో ...మిగతా 2లో

ఎన్నికల వేళ ఉద్రిక్తతలు • ఒకరిపై ఒకరు దాడులు • శాంతిభద్రతలకు విఘాతం..?

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: పుంగనూరులో జరిగిన దాడుల్లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి గన్ మెన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు.టీడీపీ నేతలు జరిపిన రాళ్ల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. తలలు పగిలాయి. రక్తం చిందుతోంది.

అయినా నామినేషన్లు వేయాలని వైసీపీ నేతలు పట్టుదలతో వెళుతుండ టంతో చివరకు రిటర్నింగ్ కార్యాలయంలోకి కూడా ప్రవేశించి దాడి చేసేందుకు టీడీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో అదనపు బలగాలను రంగంలోకి దించారు. జిల్లా ఎస్పీ పరిస్థితిని సమీక్షించేందుకు అక్కడకు చేరుకుని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇరు పార్టీల కార్యకర్తల పెద్ద సంఖ్యలో మొహరించడంతో పోలీసులు లాఠీ ఛార్జిని జరిపారు. పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరసగా దాడులు జరుగుతున్నాయి. పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు నిర్వహించారు. నామినేషన్లు నేటి నుంచి ప్రారంభం కానుండటతో టీడీపీ, వైసీపీ మధ్య కార్యకర్తల వరసగా దాడులు జరుగుతున్నాయి. నామినేషన్లు దాఖలు చేసే తొలి రోజే యుద్ధ వాతావరణం నెలకొనడంతో శాంతిభద్రతలు అదుపుతప్పే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రాయచోటిలో వైసీపీ కార్యాలయానికి నిప్పు

రాయచోటిలోనూ వైసీపీ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి నిప్పు పెట్టారు. దీంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

తమ కార్యకర్తలను వైసీపీ నేతలు రెచ్చగొట్టడం వల్లనే తాము ప్రతి చర్యకు దిగామని టీడీపీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల వేళ తగలబడిపోయే విధంగా తయారయింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని దాటుకుని మరీ ఒకరిపై ఒకరు దాడికి దిగుతున్న ఘటనలు అనేక చోట్ల జరుగుతున్నాయి. దాదాపు పది వాహనాలు ధ్వంసమయ్యాయి.

ధర్మవరంలో ఉద్రిక్తతలకు వైసీపీ నేతలే కారణం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, అక్టోబరు 16 మనం న్యూస్: ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు వైసీపీ నేతల రెచ్చగొట్టే ధోరణే కారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, వైసీపీ అభ్యర్థులను అడ్డుకోవాలన్న ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.నామినేషన్ల ...మిగతా 2లో

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి

- భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం
- రైతులకు, యువతకు మెరుగైన అవకాశాలు లభించాలి
- దసరా మహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు
- రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

హైదరాబాద్, మనంప్రతినిధి: అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం అమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి తొలుత ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ...మిగతా 2లో

అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు!

పనుల పురోగతిపై మంత్రి నిమ్మల క్షేత్రస్థాయి సమీక్ష

6

ఢిల్లీలో సీజేపీ తిరంగా మార్చ్..

పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

ఢిల్లీ, అక్టోబర్ 16: సీజేపీ తిరంగా మార్చ్‌కు పిలుపు ఇచ్చిన వేళ శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరోల్ బాగ్‌లో ఆయన బస చేసిన చోటు నుంచి కన్నాట్ పేస్‌లోని సెంట్రల్ పార్కు వద్దకు బయల్దేరడానికి సిద్ధమవుతుండగా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసు వాహనాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా నిరసనకారులు చుట్టుముట్టారు. పోలీసులు తనను అరెస్ట్ చేయడంపై దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ చట్టాన్ని ...మిగతా 2లో

మరోసారి భద్రతా బలగాల 'బంధనం'లో ఢిల్లీ

సీజేపీ లెహ్రో దో తిరంగా ర్యాలీని అడ్డుకునేటందుకే!

2

జన్ నీతి భారత్

ఐఏఎస్ అధికారి దివ్యా మిత్తల్ యూపీలో స్థాపించిన కొత్త పార్టీ

హైదరాబాద్, అక్టోబర్ 16: స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారిణి దివ్యా మిత్తల్ కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. 'జన్ నీతి భారత్' పేరుతో నూతన రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో వీడియో సందేశాన్ని విడుదల చేశారు. విధాన నిర్ణయాల్లో ప్రజలే కేంద్రంగా ఉండేలా చూడటంపై తమ పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తుందని తెలిపారు. 13 ఏళ్ల పాటు ఐఏఎస్ అధికారిణిగా పని చేసిన దివ్యా మిత్తల్ ఈ ఏడాది ఆగస్టు 30న స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

కెనడాపై ట్రంప్ విచ్ఛిన్న కుట్ర?

19న జరగనున్న రెఫరెండమ్ నేపథ్యంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆరోపణలు

ఒట్టావా/ఆల్బెర్టా, అక్టోబర్ 16: తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెనడా ప్రావిన్స్ ఆల్బెర్టాలో వచ్చే సోమవారం రిఫరెండం జరగనున్న నేపథ్యంలో ప్రచార ర్యాలీలో కార్నీ మాట్లాడారు. ఆల్బెర్టా కెనడాలో భాగంగా ఉండేలా ఆ ప్రావిన్స్ ప్రజలు ఓటు వేయాలని కోరారు. అందుకు భిన్నంగా జరిగితే.. విభజన, అనిశ్చితికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ''ప్రపంచం ప్రమాదకరంగా, సొంత లక్ష్యాల ఆధారంగా విడిపోయి ఉంది. మన సరిహద్దులకు అవతల ఉన్నవారు మనల్ని విచ్ఛిన్నం చేసి, గుప్పిట పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా ఏమాత్రం అనుకూలంగా లేని సమయంలో రిఫరెండం జరుగుతోంది. ఇందులో నిర్ణయాత్మక ఫలితం వేర్పాటువాద సమస్యను పరిష్కరిస్తుంది. ఆల్బెర్టా విడిపోవడానికి ...మిగతా 2లో

ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ పనికిరారు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, అక్టోబర్ 16: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. యుద్ధాన్ని ముగించడానికి జెలెన్‌స్కీ సుముఖంగా లేరని.. అందువల్లే రష్యాపై దాడులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో డీల్ చేసుకోవడానికి ఆయన సరైన వ్యక్తి కారని అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఆయన ఇక ఎంత మాత్రం పనికిరారని.. కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని ఆ దేశ ప్రజలకు సూచించారు. శాంతి చర్చలు, రాజీ యత్నాలంటూ బయటకు చెబుతారు కానీ.. లోపల మాత్రం యుద్ధం ...మిగతా 2లో

మహాశక్తి యాగంలో భక్తిభావంతో కుంకుమార్చనలు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం శుక్రవారం కూడా ఎంతో ఘనంగా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ బగళాముఖి దేవిగా దర్శనం ఇచ్చారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహాశక్తి యాగం ప్రాంగణంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావ వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కుంకుమార్చనను ఒక తపస్సులా భావించి, ప్రతి నామాన్ని భక్తితో స్మరిస్తూ పూజల్లో పాల్గొనాలని స్వామివారు సూచించారు.



రేపు వేలాది మంది విద్యార్థులతో మహాసరస్వతీ పూజ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేపు ఉదయం 6.30 గంటలకే మహాశక్తి యాగం ప్రాంగణంలో వేలాది మంది విద్యార్థులతో మహాసరస్వతీ పూజ నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తి, ఏకాగ్రత, జ్ఞానసంపద పెంపొందాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వామివారు తెలిపారు. విద్యార్థులను తీసుకొచ్చే తల్లిదండ్రులు, నిర్వాహకులు ఉదయం 6.30 గంటలకే ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే సరస్వతీ పూజ సుమారు 9 గంటలకు పూర్తవుతుందని, అనంతరం విద్యార్థులు తమ కార్యక్రమాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

అష్టమి రోజున ఐశ్వర్య దీప పూజ

ఆదివారం అష్టమి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఐశ్వర్య దీప పూజ నిర్వహించనున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో ఈ పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు స్వామివారు ప్రకటించారు. ఆసక్తి ఉన్నవారు ముందుగానే శ్రీపీఠం కార్యాలయాన్ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పూజలో పాల్గొనే భక్తుల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ఐశ్వర్య దీప పూజతోపాటు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నారు. భక్తులు తమకు అందించిన శ్రీయంత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారి ముఖరూపం దీపం వెలిగించినప్పుడు కనిపించేలా ప్రత్యేకంగా రూపొందించిన ఐశ్వర్య దీపాన్ని భక్తులకు అందించనున్నారు. ఇంట్లోనే అమ్మవారిని నిత్యం ఆరాధించుకునేలా ఈ దీపాన్ని రూపొందించినట్లు స్వామివారు వివరించారు. దూరప్రాంతాల భక్తులకు పూజ అనంతరం కొరియర్ లేదా పోస్టు ద్వారా దీపాలను పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం ఇదే ప్రాంగణంలో అత్యంత విశిష్టమైన నవశక్తి హోమం నిర్వహించనున్నట్లు స్వామివారు వెల్లడించారు. హోమంలో పాల్గొనాలనుకునే భక్తులు శ్రీపీఠం కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. భక్తుల కోసం ప్రత్యేక హోమకుండాలు, అవసరమైన హోమద్రవ్యాలను సిద్ధం చేసి, స్వయంగా తానే కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఐశ్వర్య దీప పూజ, నవశక్తి హోమం రెండింటిలోనూ పాల్గొనాలనుకునే భక్తులకు వీలుకల్పించాలని నిర్వాహకులకు సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల వివరాలను ముందుగానే తెలుసుకుని తమ భాగస్వామ్యాన్ని ఖరారు చేసుకోవాలని కోరారు.

భక్తులకు సేవ చేయడమే ప్రధాన సంకల్పం

మహాశక్తి యాగానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటానికి అమ్మవారిపై వారికి ఉన్న అచంచలమైన విశ్వాసమే కారణమని పరిపూర్ణానంద స్వామివారు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని తెలిపారు. యాగానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం, పూజలు, దర్శనం వంటి సౌకర్యాలు అందించేందుకు కార్యకర్తలు కృషి చేస్తున్నారని చెప్పారు. భక్తులు ప్రసాదాన్ని అమ్మవారి అనుగ్రహంగా భావించాలని, ప్రతి సేవను పవిత్రమైన సంకల్పంతో నిర్వహించాలని సూచించారు. మహాశక్తి యాగం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాదని, భక్తులందరినీ ఒకే ఆధ్యాత్మిక భావనతో అనుసంధానించే సాధన అని వివరించారు.

ఆధ్యాత్మికతకు సమయం కేటాయించాలి

ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ మనిషి జీవితంలో కీలక భాగంగా మారిందని, సమాచార మార్పిడికి అది ఉపయోగకరమైన మాధ్యమమే అయినప్పటికీ, దానికి అతిగా ప్రాధాన్యం ఇవ్వకూడదని స్వామివారు సూచించారు. అనవసరమైన విషయాలతో మనసును నింపుకోవడం వల్ల ధ్యానం, ఆరాధనపై ఏకాగ్రత తగ్గుతుందని చెప్పారు. ప్రతిరోజూ కనీసం 24 నిమిషాలు అమ్మవారి ఆరాధనకు కేటాయించాలని సూచించారు. లలితా సహస్రనామ పారాయణం, దీపారాధన, ధ్యానం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చన్నారు. విషయాలపై మనసును కేంద్రీకరించడానికి బదులుగా దైవచింతనకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించినందుకు తనను నిర్బంధించారో చెప్పాలని ప్రశ్నించారు. వారం రోజుల్లో దీప్కేను అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఢిల్లీలోని సెంట్రల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు జాతీయ జెండాను ఎగరవేయాలని సీజేపీ తన మద్దతుదారులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సీజేపీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా అరెస్టు కూడా ఈ మార్చుకు మరో కారణం. ఈ నేపథ్యంలోనే పోలీసులు తొలుత దీప్కే నివాసం ఉన్న చోటకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొడుతున్నారని, అలాంటి చర్యలు చట్టవిరుద్ధమని అందులో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలు హాస్యాస్పదమని, హింసను ప్రేరేపించేవిధంగా ఉన్న ఒక్క వీడియోనైనా చూపించాలని దీప్కే పోలీసులతో అన్నారు.

కెనడాపై ట్రంప్ విచ్చిన్నకుట్ర?

(మొదటి పేజీ తరువాయి)

వేసే ఓటు సంవత్సరాల తరబడి అనిశ్చితికి దారితీస్తుంది'' అని ఆ ప్రావిన్స్ ప్రజలను హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా, కెనడా మధ్య ట్రేడ్ వార్ నడుస్తోంది. మరోవైపు కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యలకు గతంలోనే కార్నీ కౌంటర్ ఇచ్చారు. ఆల్బెర్టా ప్రజలు కెనడా నుంచి విడిపోవాలని గతంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఆల్బెర్టా.. చమురు, సహజవాయువులతో సుసంపన్నమైన ప్రాంతం. తాము కెనడా ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో సహకరిస్తున్నప్పటికీ.. తమకు లభిస్తున్న ప్రాతినిధ్యం, నిధులు తక్కువని ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఆర్థిక అసమానతలు, ఫెడరల్ ప్రభుత్వ విధానాలు, రాజకీయ విభేదాలు వేర్పాటువాద ఆలోచనకు బలం చేకూరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 19న ఓటింగ్ జరగనుంది. కెనడా నుంచి వేరుపడే ప్రక్రియను చట్టబద్ధంగా ప్రారంభించాలా.. వద్దా..?అనే దానిని దీని ద్వారా నిర్ణయించనున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ఎన్నికల ప్రణాళిక, కూటమి వ్యూహం, నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి, వైసీపీ నేతల అల్లర్లపై కీలక విషయాలను వెల్లడించారు.

స్థానిక ఎన్నికలు-ప్రభుత్వ పాలనకు కొలమానం

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనా తీరుకు కొలమానమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే అభ్యర్థుల విజయానికి పునాది అని అన్నారు. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ అంతా డిసెంబర్ 1 నాటికి పూర్తవుతుంది. నేటి నుండి మున్సిపల్ నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలు 3 దశల్లో జరుగుతాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో రూపొందించిన మెటీరియల్ను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కోసం పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని స్పష్టం చేశారు.

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు...

గతంలో మూలా నక్షత్రం రోజున శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారని, క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన ప్రక్రియను మరింత సులభతరం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ఏడాది దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు సైతం ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, ప్రశాంతంగా, తృప్తిగా దర్శనం చేసుకుని తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలన్న సత్సంకల్పంతో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

క్యూ లైన్లు ఎంత పొడవుగా ఉన్నా భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం...

దసరా ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, వారికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేకించి సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరూ అమ్మవారిని సంతృప్తికరంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

అమ్మవారి కృపతో రాష్ట్రంలో సిరిసంపదలు వెల్లివిరియాలి...

దసరా పర్వదినం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు. యువతీ యువకులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారాలని కోరుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని, రాష్ట్ర ప్రగతికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా అమ్మవారి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. అదేవిధంగా దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడంతో పాటు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. విలేకరుల కుటుంబాల్లోనూ సుఖసంతోషాలు వెల్లివిరియాలి.ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న విలేకరుల సోదరులకు మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విలేకరులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, వారు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగిపోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని అయన తెలిపారు.

ధర్మవరంలో ఉద్రిక్తతలకు వైసీపీ నేతలే కారణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలో ధర్మవరం పట్టణానికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి వివాదాలు సృష్టించడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు, బైండోవర్ చర్యలు ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొంటూ, ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.గాయాలయ్యాయని చెబుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని వీల్చైర్లను పోలీస్స్టేషన్కు తీసుకెళ్లడంపై మంత్రి విమర్శించారు. ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన సదుపాయాలను రాజకీయ ప్రచారానికి వినియోగించడం సరికాదన్నారు. గాయాల తీవ్రతపై వైద్య పరీక్షలు, సంబంధిత ఆధారాల ద్వారానే వాస్తవాలు నిర్ధారణ కావాలని పేర్కొన్నారు.గతంలో ప్రజలు వైసీపీని తిరస్కరించడానికి ఇలాంటి రాజకీయ ధోరణులే కారణమని విమర్శించిన సత్యకుమార్ యాదవ్, ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేయకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సాక్షాత్కారింపజేస్తూ శ్వేత పద్మాన్ని అధిష్ఠించిన దుర్గామాత తెలుపు రంగు చీరలో బంగారు వీణ, దండ, కమండలం ధరించి అభయముద్రతో సరస్వతీ దేవిగా భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ రోజున అమ్మవారికి గారెలు, పూర్ణాలను నైవేద్యంగా సమర్పిస్తారు.సరస్వతి దేవిని చదువుల తల్లిగా అరాధిస్తారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

హైదరాబాద్,అక్టోబర్, 16,(మనం ప్రతినిధి): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

శుక్రవారం అమ్మవారి దర్శనం అనంతరం అందరికీలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాల నిర్వహణ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ, పోలీస్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ, దర్శన ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణలో అధికారుల సమష్టి కృషి అభినందనీయమని అన్నారు.

ఇప్పటివరకు దాదాపు 4.80 లక్షల మంది భక్తులు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరమని తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించిన ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన చర్యలు

గతంలో మూలా నక్షత్రం వంటి ప్రధాన పర్వదినాల్లో భక్తుల రద్దీ కారణంగా బారికేడ్ల వద్ద క్యూ లైన్లు నిలిచిపోవడం, వీఐపీ దర్శనాల వల్ల సాధారణ భక్తులకు ఇబ్బందులు ఎదురవడం వంటి పరిస్థితులు తలెత్తేవని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, సాధారణ భక్తులకు ప్రాధాన్యతనిచ్చేలా దర్శన ఏర్పాట్లను రూపొందించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వీఐపీ దర్శనాలను కూడా గణనీయంగా తగ్గించి, సామాన్య భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

కృత్రిమ మేధస్సుతో క్యూ లైన్ల నిరంతర పర్యవేక్షణ

దర్శన క్యూలైన్ల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా రద్దీ పరిస్థితులను పర్యవేక్షిస్తూ, క్యూ లైన్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

భక్తులు ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితులు తగ్గాయని, దర్శన ప్రక్రియ మరింత సులభతరంగా మారిందని పేర్కొన్నారు. భక్తులు సైతం ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

క్యూలైన్లలోనే తాగునీరు, మజ్జిగ, చిన్నారులకు పాలు

అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. భక్తులకు నిరంతరంగా తాగునీరు, మజ్జిగ అందించడంతో పాటు చిన్నారుల కోసం పాలు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

ఈరోజు సాయంత్రం అమ్మవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

ఈ కార్యక్రమానికి సంబంధించి ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలి

శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకున్నారు.

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగానికి మేలు జరగాలని, ప్రజలందరికీ మంచి రోజులు రావాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్స్కీ పనికిరారు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించాలనే ఆయన కోరుకుంటారన్నారు. జెలెన్స్కీ వల్లే ఆ దేశం నాశనం అవుతోందని దుయ్యబట్టారు. మరోవైపు 2014లో రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ యుద్ధం కొనసాగింపునకు గత ఒబామా, బైడెన్ ప్రభుత్వాలు అందించిన సాయంపై కూడా విమర్శలు చేశారు. కాగా..రష్యాలోని ర్యాజాన్ ప్రాంతంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ గురువారం డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు మధ్య ఉక్రెయిన్‌లోని కిరోవోగ్రాడ్ ప్రాంతంపై మాస్కో విరుచుకుపడడంతో ముగ్గురు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది వెలువడి వారం కూడా పూర్తి కాక ముందే ఇరుదేశాలు పరస్పర దాడులకు పాల్పడుతుండడం గమనార్హం.

వీణ-వాణీల 24వ పుట్టినరోజు

హైదరాబాద్, అక్టోబర్ 16: అవిభక్త కవలలు వీణ-వాణీలు 24వ వసంతంలోకి అడుగిడనున్నారు. వారు జన్మించిన నాటి నుంచి విడదీయాలని కోరుతూ ప్రభుత్వాలు, వైద్యులను వేడుకుంటున్నా ఫలితం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీణ-వాణీలకు పుట్టిన నాటి నుంచి పదేండ్ల వయసొచ్చే వరకు హైదరాబాద్ లోని నిలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం హైదరాబాద్ లోని శిశువిహార్‌కు తరలించగా అక్కడే ఉంటూ బీకాం పూర్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరెళ్లిగూడెం గ్రామానికి చెందిన మారగాని మురళి, నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా అవిభక్త కవలలుగా జన్మించారు. 2003 అక్టోబరు 16న సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పుట్టకతోనే తలలు అతుక్కుని జన్మించారు. రెండేళ్ల పాటు గుంటూరుకు చెందిన వైద్యుడు నాయుడమ్మ చికిత్స అందించారు. 2006 నుంచి నిలోఫర్, ముంబయిలోని బ్రీచ్ క్యాండీ, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియాలకు చెందిన ప్రఖ్యాత వైద్యులు పరీక్షించారు. అయినా తమ పిల్లల కష్టాలు తీరుతాయని ఆశించిన వారి తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది.

దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలను తలపై ధరించి మంగళవాయిద్యాల నడుమ గర్భాలయానికి తీసుకువెళ్లారు. సరస్వతీ దేవి అలంకారం: నవరాత్రులలో మూలా నక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమివ్వడం అనూహ్యమైన పుణ్యఫలంగా భావిస్తారు. సీఎం దంపతులు అమ్మవారికి అర్చనలు, హారతులు ఇచ్చి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై పోలీసులు, ఆలయ అధికారులు ఈవో, చైర్మన్ ముందస్తుగానే భారీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఎం దర్శన సమయాన్ని కేటాయించారు.

క్యూలైన్లలో ఉన్న భక్తులకు సౌకర్యాలను కూడా అధికారులు పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమ్మవారి ఆశీస్సులతో స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

మరోసారి భద్రతా బలగాల 'బంధనం'లో ఢిల్లీ

ఢిల్లీ, అక్టోబర్ 16: దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ లో ఉన్న సెంట్రల్ పార్క్ లో సీజేపీ శుక్రవారం 'లెహ్ దో తిరంగా' పేరుతో ర్యాలీని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 6 వేలమంది ఢిల్లీ పోలీసులతో పాటు 220 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. సీసీటీవీ కెమెరాల సంఖ్యను పెంచారు.

కన్నాట్ ప్లేస్ సహా రాజీవ్ చౌ

తొలిరోజే రక్తగాయాలతో ఘర్షణలు..

- పోలీసు యంత్రాంగం మేలుకోవాలి!
- ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు భరోసా కల్పించాలి
- లేదంటే భయాందోళనల మధ్య ఓటు హక్కు వినియోగం

ధర్మవరం అక్టోబర్ 16 మనం న్యూస్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజే ఘర్షణలు, రక్తగాయాలకు దారితీయడం పట్టణంలో ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాల్సిన సమయంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం ఎన్నికల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన వార్డుల్లో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

48 వార్డులు.. 1,06,250 మంది ఓటర్లు

ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 48 వార్డులు ఉండగా, 1,06,250 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఇందుకోసం 134 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే వీటిలో 14 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన అధికారులు, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి పరిస్థితుల్లో నామినేషన్ల తొలిరోజే ఘర్షణలు చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

ముందస్తు చర్యలున్నా.. ఎందుకీ ఘర్షణలు?

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ, ముందస్తు చర్యలు తీసుకున్నప్పటికీ ఘర్షణలు చోటుచేసుకోవడం పోలీసుల వ్యూహాల అమలుపై సమీక్ష అవసరాన్ని సూచిస్తోంది. రౌడీషీటర్లను గుర్తించడం, బైండోవర్ చర్యలు చేపట్టడం వంటి చర్యలు తీసుకున్నా, వాటి ప్రభావం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఉందనే అంశాన్ని శుక్రవారం జరిగిన ఘటన నేపథ్యంలో పరిశీలించాల్సి ఉంది.

కేవలం బందోబస్తు ఏర్పాటు చేయడం, ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతోనే పోలీసుల బాధ్యత ముగిసిపోదు. ఘర్షణలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, రాజకీయ వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరగకుండా చూడడం, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం.

ఓటు వేయాలంటే భయపడాలా?

ఎన్నికలంటే ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశం కల్పించే ప్రజాస్వామ్య పండుగ. కానీ నామినేషన్ల దశలోనే రక్తగాయాలతో కూడిన ఘర్షణలు చోటుచేసుకుంటే, పోలింగ్ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయనే ఆందోళన సామాన్య ఓటర్లలో నెలకొనే ప్రమాదం ఉంది.

ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో నివసించే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర సాధారణ ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాకుండా ఓటు వేయగలరా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఓటు వేయడానికి వెళ్లే సమయంలో రాజకీయ ఘర్షణలు ఎదురవుతాయనే భయం ప్రజల్లో ఏర్పడితే, అది స్వేచ్ఛాయుత ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధం.

అందువల్ల ఓటర్లలో భయాందోళనలు తొలగించడం, వారికి భద్రతపై నమ్మకం కల్పించడం పోలీసు యంత్రాంగానికి తక్షణ కర్తవ్యంగా మారింది.

సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక నిఘా అవసరం

14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన నేపథ్యంలో, వాటికి సంబంధించిన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పరిస్థితులకు అనుగుణంగా పునఃసమీక్షించాలి. నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ధర్మవరంలో నామినేషన్ల వేళ రాళ్ల దాడి..

- ముగ్గురు వైసీపీ నాయకులకు తీవ్ర గాయాలు!
- వర్షంలోనే వీల్‌ఛైర్స్ పై బాధితులను తీసుకెళ్లిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం అక్టోబర్ 16 మనం న్యూస్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శుక్రవారం ధర్మవరం పట్టణంలోని బీఎస్సార్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కూటమి పార్టీ నాయకులు రాళ్ల దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో భగిరి భయపరెడ్డి, ఆదినారాయణ నాయుడు, అప్రాచెరువు ఈశ్వరయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి స్పందన వైద్యశాలకు తరలింపు...

రాళ్ల దాడిలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం స్పందన వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది. ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఘటన పట్టణంలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది.

వర్షంలోనూ ఆందోళన.. బాధితులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే..

గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనంతరం వినూత్న రీతిలో నిరసనకు దిగారు. వీల్‌ఛైర్స్ కూర్చున్న బాధితులను ప్రధాన రహదారి మీదుగా స్పందన వైద్యశాల నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లారు. ఒకవైపు వర్షం కురుస్తున్నప్పటికీ ఆయన బాధితులతో కలిసి ముందుకు సాగుతూ పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలు చేసుకునే హక్కుకు భంగం కలిగించే చర్యలను అరికట్టాలని కోరారు.

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగాల్సిన సమయంలో నామినేషన్ల కేంద్రం వద్ద రాళ్ల దాడి జరిగినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు, వారి అనుచరులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునే వాతావరణాన్ని కల్పించడం అధికార యంత్రాంగం బాధ్యత.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

ధర్మవరంలో తొలిరోజు ఉద్రిక్తతల నడుమ నామినేషన్లు

- 48 వార్డులకు 63 నామినేషన్లు.. వైసీపీ నుంచి 47, టీడీపీ నుంచి 14
- టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా పరిసే సుధాకర్, వైసీపీ అభ్యర్థిగా కాచర్ల ఆంజనేయులు నామినేషన్

ధర్మవరం, అక్టోబర్ 16(మనంన్యూస్): శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం మున్సిపాలిటీలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ఉద్రిక్త పరిస్థితుల మధ్య కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ధర్మవరం మున్సిపాలిటీలోనే నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.

తొలిరోజే 63 నామినేషన్లు

ధర్మవరం మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులకు గాను తొలిరోజు 63 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్సీపీ నుంచి అత్యధికంగా 47, తెలుగుదేశం పార్టీ నుంచి 14, ఇతరుల నుంచి రెండు నామినేషన్లు నమోదయ్యాయి. తొలి రోజే వైఎస్సార్సీపీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయగా, టీడీపీ అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను సమర్పించారు.

చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు

తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థిగా పరిసే సుధాకర్, వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థిగా కాచర్ల ఆంజనేయులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, 29వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా భీమనేని ప్రసాద్ నాయుడు నామినేషన్ సమర్పించారు.

బీజేపీ నుంచి నామినేషన్లు నిల్

తొలిరోజు నామినేషన్ల వివరాల ప్రకారం బీజేపీ నుంచి ఒక్క వార్డులో కూడా నామినేషన్ దాఖలు కాలేదు. రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. 13వ వార్డులో అత్యధికంగా నాలుగు నామినేషన్లు నమోదయ్యాయి.

తొమ్మిది వార్డుల్లో నామినేషన్లు లేవు

మున్సిపాలిటీలోని 9 వార్డుల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రానున్న రోజుల్లో ఆయా వార్డుల్లో నామినేషన్ల దాఖలు పెరిగే అవకాశం ఉంది.

పటిష్ట పోలీసు బందోబస్తు

నామినేషన్ల స్వీకరణ కోసం మున్సిపల్ కార్యాలయం, బీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాంభూపాల్ రెడ్డి, వెంకట రమణయ్య తదితరులు ఆయా కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా ధర్మవరం మున్సిపాలిటీలో తొలిరోజే 63 నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. రానున్న రోజుల్లో ప్రధాన పార్టీల నుంచి మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

అన్నవరంలో టీడీపీకి సర్పంచ్ రిజర్వేషన్ సెగ!

బీసీ మహిళకు రిజర్వేషన్.. ఆశావహుల్లో అయోమయం..

అధికార పార్టీలో ఆధిపత్య పోరు తప్పదా?

భార్యలను బరిలోకి దింపేందుకు నేతల వ్యూహాలు..

ఇద్దరు టీడీపీ నేతల మధ్య పోటీపై ఉత్కంఠ

అన్నవరం, అక్టోబర్ 16, మనం న్యూస్ : అన్నవరం గ్రామపంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ సర్పంచ్ పదవికి బీసీ మహిళ రిజర్వేషన్ ఖరారు కావడంతో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా ఆసక్తికర మలుపు తిరిగాయి. ఇన్నాళ్లూ సర్పంచ్ పీఠంపై ఆశలు పెట్టుకుని గ్రామంలోని అన్ని వార్డుల్లోనూ ప్రజలను కలుస్తూ, తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నించిన ఆశావహులకు రిజర్వేషన్ నిర్ణయం ఊహించని పరిణామంగా మారింది. ముఖ్యంగా అధికార తెలుగుదేశం పార్టీలో సర్పంచ్ అభ్యర్థి ఎంపిక, ఆశావహుల మధ్య సమన్వయం ఇప్పుడు కీలకంగా మారాయి.

ఆశావహుల ఆశలపై రిజర్వేషన్ ప్రభావం!

అన్నవరం సర్పంచ్ పదవిని ఆశిస్తున్న వారిలో దారా వెంకటరమణ, మెరపల నరసయ్య, మడ్డు వీరబాబు, బొబ్బిలి వెంకన్న, సోము గౌరీశంకర్ తదితరుల పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వీరిలో పలువురు గత కొంతకాలంగా గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలను కలుస్తూ, తమ రాజకీయ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సర్పంచ్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో పురుష ఆశావహులు నేరుగా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో తమ కుటుంబాల్లోని మహిళలను ఎన్నికల బరిలోకి దింపే దిశగా కొందరు ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పుట్టపర్తిలో నామినేషన్ల కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

- ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా.. ప్రశాంతంగా సాగాలి
- అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు
- అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు

పుట్టపర్తి, అక్టోబర్ 16 మనం న్యూస్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నామినేషన్ల దాఖలు కోసం వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ తొలిరోజైన శుక్రవారం ఎనుములపల్లి బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన పరిపాలనా విభాగాలు, సహాయ కేంద్రాలు, అభ్యర్థుల సౌకర్య కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం సిబ్బంది నియామకం, అవసరమైన నామినేషన్ పత్రాల లభ్యత, అభ్యర్థుల రాకపోకల నిర్వహణ, జనసమూహ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నామినేషన్ల స్వీకరణ నుంచి పత్రాల పరిశీలన వరకు ప్రతి దశలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందికి సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు, వారి ప్రతిపాదకులకు అవసరమైన సహకారం అందించాలని, ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం అక్టోబర్ 16 మనం న్యూస్ : మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ సీనియర్ నాయకుడు బుట్టా తిమ్మరాజు భార్య బుట్టా లక్ష్మీ ని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రకటించారు. శుక్రవారం పట్టణంలోని బుట్టా తిమ్మరాజు స్వగృహంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి నాయకుల నిర్ణయంతో బుట్టా లక్ష్మీ ని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు స్వయంగా మీడియా ముందు ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న బుట్టా లక్ష్మీ కుటుంబంతో పాటు మనం కూడా ప్రతి ఒక్కరు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అది సాధ్యం కావాలి అంటే మున్సిపాలిటీలో వైసీపీ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు రాకుండా కూటమి అభ్యర్థికి మెజారిటీ ఇవ్వాలని, ఇప్పుడు చూస్తున్న అభివృద్ధే కాకుండా రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తీర్పు ఇవ్వాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు

గూడూరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గూడూరు, జులకల్ గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచాలని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కుళాయప్ప, సి. బెళగల్ ఎస్ఐ వేణుగోపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతోనే నిర్మాణ రంగానికి గుర్తింపు

- సాయి తీరం విల్లాస్కు భూమిపూజ.. పనులకు శ్రీకారం
- నిర్మాణాల్లో ప్రమాణాలు పాటించాలి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి, అక్టోబర్ 16 మనం న్యూస్: నిర్మాణ రంగంలో నాణ్యతే ప్రధానమని, చేపట్టే ప్రతి పనిలో పటిష్టతకు ప్రాధాన్యం ఇవ్వాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. నిర్మాణ పనుల్లో ఉపయోగించే సామగ్రి నుంచి పనుల పూర్తయ్యే వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీపడకూడదని స్పష్టం చేశారు.

పుట్టపర్తిలో శుక్రవారం సాయి తీరం విల్లాస్ నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్మాణాలు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన నిర్మాణాల ద్వారానే వినియోగదారుల విశ్వాసాన్ని పొందగలమని పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన పుట్టపర్తిలో నిర్మాణ రంగం అభివృద్ధి చెందడం శుభపరిణామమని వారు అభిప్రాయపడ్డారు. పట్టణంలో కొత్త నిర్మాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి ఊపందుకోవడం వల్ల స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సంస్థలు నాణ్యత, విశ్వసనీయతకు పెద్దపీట వేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సాయి తీరం విల్లాస్ నిర్వాహకులు రమేష్, గంగాధర్ నాయుడు, పీసీ గంగన్న, స్థానిక ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవి అలంకరణ లో దర్శనం

కాటేనికోన, అక్టోబర్ 16 మనం ప్రతినిధి : శ్రీశ్రీశ్రీ పట్టాభిరామ స్వామి వారి ఆలయంలో కోలువైయున్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవంలో బాగంగా 6 వ రోజు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. .అమ్మవారి అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది 6 వ రోజు పూజ చేయించుకున్న దంపతులు పత్సమంట్ల శ్రీ రామ చంద్రరాజు, సుబ్బలక్ష్మి మరియు పొత్తూరి జానకీ రామ రాజు, మంగయ్య మ్మ దంపతులు . అనంతరం విద్యార్థి.విద్యార్థులు చే పండితులు విశ్వనాథ శాస్త్రి చే సరస్వతి పూజ కార్యక్రమం చేయించ డం జరిగింది .అధిక సంఖ్యలో విద్యార్థి ,విద్యార్థులు వచ్చి భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమం నిర్వహించ డం జరిగింది . విద్యార్థిని , విద్యార్థుల కు కీర్తి . శేషులు ఆకాశ్ కుమార్ వర్మ పేరు న కూల్ డ్రింక్స్ అందచేయ డం జరిగింది .పొత్తూరి సూర్య కార్తికేయ వర్మ ,తేజస్వి లక్ష్మీ 100 బుక్స్, 100 పెన్నులు మరియు పత్సమంట్ల కౌశిక్ వర్మ 60 పెన్నులు పశ్సమంట్ల రిషి వర్మ 100 పెన్నులు మరియు పి . రవి రామ రాజు,30 పెన్సిల్ లు విద్యార్థిని , విద్యార్థుల కు అందజేశారు . కుంకుమ పూజలు అధిక సంఖ్యలో జరిగాయి. అనంతర ప్రసాదవితరణ చేశారు.

గొప్ప దేశద్రోహికి బంటు

జంతర్ మంతర్ సాక్షిగా
'జ్ఞానేశ్వర్' రాజీనామా కాస్తా
ఢిల్లీ పెద్దల 'జ్ఞాన-శూన్య-ఈశ్వర్' డ్రామాగా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
జనం కోరిన ఓట్ల నమోదు
'ఫామ్-6' కాస్తా
దొంగచాటు చట్టాల కల్తీ 'ఫార్మ్-మిక్స్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ఓట్ల లెక్కలు చూడాల్సిన
నిఘార్పైన 'ఆర్టిస్ట్' కాస్తా
ప్రజా తీర్పును తొక్కేసే ఓట్ల అర్లిస్ట్ బ్రోకర్ లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
కోట్ల మంది జనం హక్కు అయిన
పారదర్శక 'ఓటర్ లిస్ట్' కాస్తా
దొంగ ఓట్లతో దాన్ని 'ఓవర్ లిస్ట్' గా
మరియు దొంగల 'కాజర్ లిస్ట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
జనం పక్షాన నిలబడాల్సిన
పవిత్రమైన బీజేపీ కాస్తా
సామాన్యుడిని నిలువునా బాది పిండేసే
'దొడ్డ దొరల బాజో-జనతా-పీటో' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన
పవిత్రమైన 'ఎలక్షన్' కాస్తా
ప్రజలను భ్రమల్లో ముంచేసే
'ఎల్యూషన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ఓట్ల తీర్పును దాచే పవిత్రమైన
'బ్యాలెట్ బాక్స్' కాస్తా
నోట్ల కట్టలను వేటాడి దాచుకునే
'వాలెట్ బాక్స్'లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
వ్యవస్థను ప్రశ్నిస్తూ కోర్టులు పంపే నిఖ్సాన
'లీగల్ నోటీస్' కాస్తా
ఢిల్లీ పెద్దల అండతో ఆ నోటీసులను
తూంగలో తొక్కుతూ
కేవలం 'ఈగల్ నోటీస్'లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
అన్యాయాన్ని చీల్చి చెండాడుతూ సుప్రీంకోర్టు
ఇచ్చే పవిత్రమైన 'జడ్జ్మెంట్' కాస్తా
కుర్చీని కాపాడుకునేందుకు
చట్టాల సందుల్లో దూరి
ఆ తీర్పులనే దగా చేసే 'ఫడ్జ్మెంట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
చట్టాలను తయారుచేయాల్సిన పవిత్రమైన
'పార్లమెంట్' కాస్తా ప్రజాప్రతినిధులను
కొని అద్దెకు పెట్టుకునే కార్పొరేట్
'పార్ల-మొత్తం-రెంట్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
నిష్పక్షపాతంగా నడవాల్సిన
'ఎన్నికల కమిషన్' కాస్తా
ఢిల్లీ పాలకుల కనుసైగలకు తలాడించే
ఒక బానిస 'సబ్-మిషన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
ప్రజల కష్టాలను వినిపించే
స్వతంత్ర 'మైక్రోఫోన్' కాస్తా
దొంగచాటుగా దూరే
గూఢచారి 'పెగాసస్-ఫోన్' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
తప్పు చేసిన నాయకుడిని బోనులో
నిలబెట్టే 'కోర్టు మెట్లు' కాస్తా రాజకీయ బేరసారాల
పొలిటికల్ 'రిసార్టు మెట్లు' లా
బ్యూటిఫుల్ గా మార్చేశారు స్వర్ణ కమలం లా!
కానీ ఆ దుర్మార్గాన్ని అవినీతిని
అరికట్టేందుకు ఒక నిఖార్పైన
కౌంటర్ లా'సిజెపి' పుట్టుకొస్తే
ఢిల్లీ పెద్దలు భయపడి
వీధివీధినా లారీలు
ఝుళిపిస్తూ దాన్ని కాస్తా
ఛార్జ్-జనతా-పోలీస్' లా
మార్చేస్తున్నారు చాలా గ్రేట్ గా!

- సర్వేశ్వరరావు నీలం
630 4664 725

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

దారిద్ర్య నిర్మూలనలో పాలకుల వైఫల్యాలు

ప్రేదరిక నిర్మూలన పేరిట ప్రత్యేకంగా ఏటా ఓ రోజును కేటాయించి జరుపుకొంటూనే ఉన్నాం. అదే అక్టోబర్ 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో మగ్గుతున్న వారి స్థితిగతులను అర్థం చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేసేందుకు ఐక్యరాజ్యసమితి 1990 అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా ప్రకటించింది.

హింసకు అత్యంత హీనరూపం పేదరికం అనేది మహాత్మాగాంధీ మాట. దారిద్ర్యం (Poverty) ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం లేదా దారిద్ర్యం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని 'పేదలు' అంటారు. పేదలకు ప్రధాన ఆదాయ వనరు ఉపాధి. కాబట్టి, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సరైన ఉపాధి అవకాశాలు లేని ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కష్టమైన పని. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారు తున్నాయి. ప్రజల చేతుల్లో డబ్బు ఉన్నంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినట్లు కాదు, వారికి విద్య, వైద్యం, రుణ సదుపాయం, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అవన్నీ లేవంటే సమగ్ర అభివృద్ధి జరగడం లేదని భావించాలి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్నది ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని 2019 జూలైలో ఆ సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు 'పేదలకు బాగానే అందు తున్నాయి. కానీ, నిరుపేదలకు అంద డం లేదు'. కొందరి గుప్పిట్లోనే సంపద 'దారిద్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం' పేరిట ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ఆసక్తికర అంశాలను వెల్లడించింది.

101 దేశాల్లో 23.1 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగం 18 ఏళ్లలోపువారే. అధ్యయనం జరిపిన దేశాల్లో 17.5 శాతం వయోజనులు పేదరికంలో మగ్గుతుండగా, 33.8 శాతం చిన్నారులు ఆ దురవస్థలో కూరుకు పోయి ఉన్నారు. 1990 నుంచి 2015 వరకు ప్రపంచంలో

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (రోజుకు1.90 డాలర్లు(దాదాపు రూ.135) లేదా అంత కంటే తక్కువ ఆదాయం) వారి సంఖ్య 190 కోట్ల నుంచి 73.5 కోట్లకు తగ్గింది. అంటే, 1990లో మొత్తం జనాభాలో 36 శాతం మంది పేదరికంలో ఉంటే... 2015 నాటికి అది 10 శాతానికి తగ్గింది. 2015 నాటికి అసమానతల వల్ల వృద్ధిలో వెనకబాటు, దారిద్ర్య నిర్మూలనలో సానుకూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం. వయసు, లింగం, వైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థిక వంటి వైరు ద్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆదాయం కనీస అవసరానికి అనుగుణంగా ఉండాలనేది భావన.

2012లో అంతర్జాతీయంగా 90 కోట్ల మంది రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ కోట్లకు పడి పోయింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా, దుర్భర దారిద్యం ప్రపంచ మానవాళిని దారుణంగా వేధిస్తోంది. 'క్రెడిట్ న్యూస్' నివేదిక ప్రకారం కేవలం ఒక శాతం సంపన్నుల చేతిలో ప్రపంచంలోని సగానికిపైగా సంపద కేంద్రీకృతమై ఉంది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాల్లో మానవ మేధ గగన సీమలను చుంబిస్తున్నా సర్వకాల సర్వావస్థల్లో విస్తరిస్తున్న పేదరికానికి అడ్డుకట్ట వేయడంలో దారుణ వైఫల్యం వెక్కిరిస్తోంది. నేటికీ లక్షల మంది చిన్నారుల బాల్యం దోపిడికి గురవుతోంది. పేదరికంలో మగ్గుతున్న చిన్నారులు తమ హక్కుల్ని, ఆరోగ్యాన్ని, పోషకాల్ని, విద్యావకాశాలను కోల్పోతున్నారు. ఇవాళ అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం జరుపుకొంటున్నాం. ప్రపంచం నుంచి పేదరికాన్ని తరిమి కొట్టడం సహస్రాబ్ది, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకంగా చెప్పుకొన్నారు. కానీ, ఆ లక్ష్యాలు సాకారమయ్యే అవకాశం కనుచూపు మేరలో కనిపించక పోవడమే బాధాకరం.

అవమానాల నుంచి, వెలివేతల నుంచి బాధా సర్ప దష్టులనూ విముక్తి కలిగించి, అందరి భాగస్వామ్యంతో పేదరికాన్ని పునాదుల నుంచి పరిమార్చడమే నినాదంగా పేదరిక నిర్మూలన దినోత్సవం జరుపుతున్నారు. సర్వత్రా పెనువేగంతో విస్తరిస్తున్న అసమానతలు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. దేశాల మధ్య యుద్ధం కాదు, పేదరికంపై సమరం చేయాలని ఆ మధ్య భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అందరికీ ఉపాధి కల్పించినట్లయితే పేదరికం, ఆదాయ అసమానతలను తగ్గించవచ్చు. ప్రభుత్వం, నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి.

భారత దేశంలో వ్యవసాయం 50 శాతం శ్రామికులకు జీవనాధారం కల్పిస్తోంది. ఈ రంగం అనుబంధ వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలను పెద్ద సంఖ్యలో అందించ గలదు. 2022 కల్లా రైతుల ఆదాయాలను సమయాల్లోనే కాదు, పంటలు విరగ పండిన సంవత్సరాల్లోనూ రైతులకు అరకొర ధరలైనా దక్కడం లేదు. అన్నదాతల ఆదాయాలు పెరగనంత వరకు పేదరికాన్ని నిర్మూలించలేం. ఇక భారతీయ శ్రామికుల్లో 92 శాతం అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. వారికి వేతనాలు బహు తక్కువ. పింఛన్ల వంటి సామాజిక భద్రత భృతులేవీ లభించవు. పైగా పని పరిస్థితులు దుర్భరం.

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారిపోతున్న దృష్ట్యా సంఘటిత రంగ కార్మికులు సరికొత్త ఉద్యోగాల్లో మహిళల వాటా సైతం పెరగాలి. ఇతర దేశాల్లో 50 నుంచి శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత దేశంలో వారి సంఖ్య కేవలం 24 శాతం. స్థూలంగా చూస్తే భారత్, చైనాలు రెండింటిలో అసమానత ఒకేరకంగా ఉన్నట్లు కనిపించినా భారతీయ పేదలు కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో ఉన్నారు. విద్య, వైద్యం, ఇతర సేవలూ సరిగ్గా అందడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా... ఏళ్లయినా రైతులకు ఇప్పటికీ గిట్టుబాటు ధరలను అందించ లేక పోవడం విచారకరం.

అనావృష్టి పీడిత ప్రతి పౌరుడికి కొంత ఆదాయం అందించడానికి సార్వజన కనీస ఆదాయ పథకం పెట్టాలని ప్రపంచ మంతటా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ పథకాన్ని మొదట వృద్ధుల సంక్షేమం కోసం అమలు చేయవచ్చు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న వృద్ధులకు దీనివల్ల ఎంతో ఊరట కలుగుతుంది. తరవాత మిగతా లబ్ధిదారులకు క్రమంగా ఈ పథకాన్ని వర్తింప జేయవచ్చు.

అనారోగ్యం ఉపాధి కోల్పోవడం, పంట నష్టం వంటి అనూహ్య విపత్తులతో అతలా కుతలమయ్యే పేదలకు కనీసా దాయ పథకం ఎంతో కొంత ఆసరా ఇస్తుంది. అదే సమయంలో పేదలకు సరైన ఉపాధి కల్పించడం ఎంతో ముఖ్యం.

అక్టోబర్ 17...అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలన దినోత్సవం
- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నవజీవన్‌తో నవభారతం చేసిన గాంధీజీ



ఒక దినపత్రిక ద్వారా దాస్యశృంఖాల నుండి ఒక దేశానికి ఎలా స్వేచ్ఛ ప్రసాదించ వచ్చో, 'నవ జీవన్' పత్రిక ద్వారా మహాత్మాగాంధీ ప్రపంచానికి చాటి చెప్పారు. 'ఒక అణా'తో ఎనిమిది పేజీల వార పత్రిక సెప్టెంబర్ 7వ తేదీన 1919లో గాంధీజీ ప్రారంభించిన నవజీవన్ పత్రిక మొత్తం దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చింది.. బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని మట్టి కరిపించింది.. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన సంఘటనలు, తదుపరి బ్రిటిష్ వారి ఆంక్షలు గాంధీజీ స్వాతంత్ర్య పోరాటానికి తరచూ ఆటంకాలు కలిగిస్తున్న సమయంలో, తన ఆశయాలైన అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, వ్యవసాయ అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధి, చేనేత వంటి అంశాలను ప్రజల చెంతకు చేర్చడానికి, దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి ఒక ఆయుధంగా పత్రికను ప్రారంభించాడు. తన ఆశయాలతో పాటు తన సిద్ధాంతాలను పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలలో ఉండే సామాన్య ప్రజలకు చేరువ చేయడానికి నవజీవన్, యంగ్ ఇండియా వంటి పత్రికలు ద్వారా చైతన్య పరచడం ప్రారంభించారు. ముఖ్యంగా పేపరులో తాను రాసే విషయాలను చదవడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా, పాఠకుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించే నూతన పత్రికా విలువలకు పునాది వేశారు. దీని ద్వారా స్వాతంత్ర్య పోరాటం మరింత బలోపేతం అవడానికి, ఎక్కువ మంది అవగాహనతో భాగస్వామ్యం అవడానికి వీలు కలిగింది. ఈ సందర్భంగా బ్రిటిష్ వారు అనేక ఆటంకాలు కలిగించేవారు. నవజీవన్ పత్రిక ప్రచురించడానికి కూడా పబ్లిషర్స్ భయపడేటట్లు బ్రిటిష్ వారు

ఆంక్షలు విధించేవారు.. అయినప్పటికీ నవజీవన్ పత్రిక ప్రజలు అందరికీ సకాలంలో చేరవేయడం ద్వారా దేశం నుంచి బ్రిటిష్ పాలకులను పార ద్రోలడానికి చక్కటి ఆయుధంగా మారింది..

నేడు కూడా పాలకులకు వ్యతిరేకంగా ఏ పత్రికైనా వార్తలు రాసినా, ఆంక్షలు విధించడం చూస్తూనే ఉన్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా, నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు చేరువ చేయడానికి 'ప్రెస్'కు ప్రముఖస్థానం కల్పించారు. అయితే నేడు మనదేశంలో పత్రిక స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది.. దాదాపు దేశంలో చాలా పత్రికలు, ఛానెల్స్ ప్రభుత్వ అనుకూలంగా మారిపోవడం బాధాకరమైన విషయం. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే. దేశంలో చాలా పత్రికలు ఛానెల్స్ ప్రైవేటు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్ళిపోవడం జరిగింది. అందుచేతనే ప్రభుత్వ అనుకూల వార్తలు, వ్యాపార ప్రకటనలు, ఎడిటోరియల్ పేజీలో ఆర్టికల్స్ వివిధ అంశాలు అన్నీ ఆయా రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉండటం జరుగుతుంది. అక్కడక్కడ దేశంలో కొన్ని పత్రికలు ఛానెల్స్ నిర్భయంగా వాస్తవానికి దగ్గరగా వార్తలు రాసినా, ప్రసారం చేసినా ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తున్న పరిస్థితి ఏర్పడింది. అదే, నాటి పత్రిక చైతన్యానికి, నేటి పత్రికా విలువలకు ఎంత తేడా ఉందో తెలుస్తుంది.

పత్రికలు సమాజ చైతన్యానికి నడుం బిగించాలి.. పాలకులు, పార్టీలు మంచి చేస్తే పొగ డాలి. తప్పులు చేస్తే సరిదిద్దే విధంగా సందేశం ఇవ్వాలి. వాస్తవాలు ప్రజలకు తెలియపరచాలి. పత్రికలు, ఛానెల్స్ అంటే సమాజానికి సేవ చేసే ఆయుదాలు. అవినీతిని చీల్చే అంకుశం. తప్పు చేసే వారిని గాడిలో పెట్టే గైడ్. ఒక సమాజ అభివృద్ధిలో, ఒక దేశ నిర్మాణంలో పత్రికలు ఛానెల్స్ సామాజిక మాధ్యమాలు పాత్ర చాలా కీలకం అని గ్రహించాలి. అంతేగానీ, ప్రభుత్వ విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతి మార్గంలో నిరసనలను వ్యక్తం చేసేవారిపై, రాతలు రాసే వారిపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించరాదు. ఆయా సమస్యలు పరిష్కారానికి పత్రికలు సూచించే పరిష్కారాలను స్వీకరించి తదను గుణంగా ప్రభుత్వాలు పాలకులు కృషి చేయాలి. పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలి. అదే సమయంలో జర్నలిజం కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. గాంధీజీ ఏ విలువలతో తన పత్రికలు నడిపించారో, ప్రజలను చైతన్యవంతులను చేసారో, దేశానికి స్వాతంత్ర్యం సాధించారో, బ్రిటిష్ సామ్రాజ్య వాద ఆంక్షలను ఎదిరించారో... నేడు కూడా పత్రికలు నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు సేవ చేయాలి. పాలనలో పారదర్శకత పెంచే విధంగా పత్రికలు తమ తమ పాత్ర పోషించాలి.. పాలకులు, ఉద్యోగస్తులు తమ విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించే విధంగా పత్రికలు మార్గదర్శకంగా నిలవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ పది కాలాలు పాటు పారదర్శకంగా పనిచేయాలి అంటే పత్రికలే పునాదులు. కాలాలు మారినా, రోజులు దొర్లుతూ ఉన్నా మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల హక్కులను కాపాడటం కోసం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించ వలసిన ప్రధాన ఆయుధాలు పత్రికలు ఛానెల్స్ సామాజిక మాధ్యమాలే. అందుకే పత్రిక స్వేచ్ఛ కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలి. ఆనాటి పాలకులు తప్పు చేస్తే, మమ్మల్ని కూడా వదలవద్దు అని దేశ ప్రధాని నుంచి గ్రామీణ ప్రాంత ప్రజాప్రతినిధి వరకూ పత్రికా విలేఖరులతో నిర్భయంగా చెప్పేవారు.. నేడు ఇటువంటి పాలకులు మచ్చుకైనా కనపడటం లేదు అంటే అతిశయోక్తికాదు. కనీసం సంవత్సరానికి ఒక్క సారైనా పత్రికా విలేఖరులతో సమావేశం నిర్వహించి, మాట్లాడే దేశ ప్రధాని గానీ , మంత్రులు గానీ కనపడటం లేదు. దేశాన్ని వెంటాడుతున్న పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, కార్పొటీకరణ, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, అనారోగ్యం, వివక్షతలు, మహిళలపై అఘాయిత్యాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ ఇలా పలు సమస్యలు పరిష్కారం కోసం, పాలకుల్లో పారదర్శకత పెంచే విధంగా, భవిష్యత్తులో వికసిత భారత్ సాధించుటలో పత్రికలు కీలక పాత్ర పోషించాలి.

- ఐ. ప్రసాదరావు
9390509791

ఎల్‌నినో

సముద్రం రగిలితే.. నేల కన్నీరు పెడుతుంది!
సముద్రం వేడెక్కితే
పవనాల నడక మారుతుంది
మేఘాల దారి మళ్లితే
రైతు ఆశలపై కరువు నీడ పడుతుంది!
పసిఫిక్ జలాల గర్భంలో
ఉష్ణోగ్రతల అసాధారణ పెరుగుదల
వాణిజ్య పవనాల బలహీనత
వెరసి వాతావరణంలో
సృష్టించే కల్లోలమే ఎల్‌నినో!
సాధారణంగా రెండు నుంచి ఏడు
సంవత్సరాల వ్యవధిలో
అప్పుడప్పుడు ఆవిర్భవిస్తూ
వాతావరణ గమనంలో మార్పులు తెచ్చే
సహజ పరిణామమే ఎల్‌నినో!
రుతుపవనాలపై అనిశ్చితి
చెరువుల గుండెల్లో నెరెలు
పంట పొలాల్లో నిశ్శబ్దం
రైతు కళ్లలో దిగులు!
బావులు అడుగంటుతాయి
పచ్చదనం పలుచబడుతుంది
పశువులకు మేత కరువవుతుంది
తాగునీటి కోసం గ్రామాల గొంతులు
ఎండిపోతాయి!
అయితే ఎల్‌నినో అంటే
కరువు తప్పనిసరి కాద
ప్రాంతాన్నిబట్టి పరిస్థితులను బట్టి
వర్షాల తీరు మారవచ్చు!
సముద్రపు సెగను ఆపలేకపోవచ్చు
కానీ నేల దాహాన్ని తగ్గించవచ్చు!
ప్రకృతి పరిణామాన్ని మార్చలేకపోవచ్చు
ముందస్తు జాగ్రత్తతో నష్టాన్ని నివారించవచ్చు!
వాన చుక్కను ఒడిసిపట్టి
జలవనరులను సంరక్షించి
రైతుకు భరోసానిచ్చినప్పుడే ఎల్‌నినో సవాలును
మన విజ్ఞానం ఎదుర్కోగలదు!

- డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

ఈశాన్యంలో మళ్లీ తిరుగుబాటు ప్రమాదం!?

భారతదేశ ఈశాన్య ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా అపరిష్కృతంగా ఉన్న నాగా రాజకీయ సమస్య నేడు అత్యంత ప్రమాదకరమైన, తీవ్రమైన సందిగ్ధంలో పడిపోయింది. దశాబ్దాల తరబడి కొనసాగిన రక్తపాతానికి, అశాంతికి స్వస్తి పలికి ఈ ప్రాంతంలో శాశ్వత శాంతిని స్థాపించాలనే సదుద్దేశంతో 2015 ఆగస్టు 3న కేంద్ర ప్రభుత్వం, నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలిమ్ (ఎన్ఎస్సీఎన్-ఐఎం) మధ్య ఒక చారిత్రాత్మకమైన చట్రపు ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందం కుదిరి దశాబ్దం గడిచినా కూడా, అది నేడు సార్వభౌమాధికారం, ప్రత్యేక జెండా, రాజ్యాంగం, పెరుగుతున్న నమ్మకలేమి వంటి అంశాలపై ఏర్పడిన తీవ్రమైన విభేదాలకు బందీ అయిపోయింది. (ఎన్ఎస్సీఎన్-ఐఎం)సంస్థ మళ్లీ తిరుగుబాటును పునరుద్ధరిస్తామని బహిరంగంగా హెచ్చరిస్తున్న నేపథ్యంలో శాంతి కోసం ఒక స్థిరమైన, గౌరవప్రదమైన రాజకీయ పరిష్కారాన్ని కనుగొనే దిశగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే బలమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే కుదిరిన ఈ ఒప్పందంపై అప్పట్లో ఈశాన్య భారత్‌తోపాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు వెలువడ్డాయి. ఈ సమస్యను అంతం చేయడం అంత తేలికైన విషయం కాదని, అయినప్పటికీ 'సార్వభౌమాధికారాన్ని పంచుకోవడం' వంటి ఉన్నతమైన రాజ్యాంగ అంశాల ద్వారా దీనిని సాధించగలమని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అప్పటి ప్రధాన మధ్యవర్తి, ఐబీ డైరెక్టర్ ఆర్.ఎన్. రవి గట్టి హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయి. 2014 నుండి 2021 వరకు ఆర్.ఎన్.రవి ఎటువంటి పురోగతిని సాధించలేక పోయారు. ఆ తర్వాత ఆయన నాగాలాండ్ గవర్నర్ పదవి నుండి తమిళనాడుకు బదిలీ అయ్యారు. రవి నుండి బాధ్యతలు స్వీకరించిన ఐబీ స్పెషల్ సెక్రటరీ ఏకే మిశ్రాను ఉద్దేశించి, రవి సమర్పించిన ప్రభుత్వ సామర్థ్యాల రికార్డు ఏదీ అందుబాటులో లేదని ప్రజల ముందే వెల్లడించడం కేంద్ర ప్రభుత్వ విధానాలలోని తీవ్రమైన డొల్లతనాన్ని, సమన్వయ లోపాన్ని బయట పెట్టింది. 2024 నవంబర్‌లో మిశ్రా పదవీ విరమణ పొందారు. మధ్యవర్తి స్థాయి నుండి కేవలం ఒక ప్రతినిధి స్థాయికి మిశ్రా కుదించబడ్డారు. శాంతి చర్చల్లో అంతరాయం కలగకుండా చూసేందుకు 2022 నుండి 2025 మధ్య ముయివా రహస్య సమావేశాలు జరిపిన ప్పటికీ, మిశ్రాను ఈశాన్య రాష్ట్రాలకు సలహాదారుగా మార్చి దారి మళ్లించడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ పరిణామాలతో తీవ్ర నిరాశకు గురైన ముయివా నాగా చరిత్రలోనే మొదటిసారిగా మూడో పక్షం జోక్యాన్ని కోరాల్సిన దుస్థితి తలెత్తింది.

నాగా ఉద్యమ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, 1955లో నాగాలు తిరుగుబాటును ప్రకటించిన నాటి నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగా ప్రజల హృదయాలను గెలవాలని సూచించారు తప్ప కేవలం బలప్రయోగాన్ని మాత్రమే నమ్ముకోలేదు. కాలక్రమేణా మారుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వాల విధానాలు సమస్యను మరింత సంక్లిష్టం చేశాయి. 2002లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో నాగా సార్వభౌమాధికారాన్ని గుర్తించిన అమ్‌స్టర్‌డామ్ సంయుక్త ప్రకటనను ముయివా ఇప్పటికీ గుర్తు చేస్తూనే ఉంటారు. కానీ 2017లో ఏడు నాగా గ్రూప్‌లతో రవి కుదుర్చుకున్న ఒప్పందం 'ఫ్రేమ్‌వర్క్ ఒప్పం దాన్ని పూర్తిగా నీరుగార్చే వ్యూహమని, ఇది తమను మానసికంగా మరియు రాజకీయంగా విభజించడానికి కేంద్ర ప్రభుత్వం ఆడిన నాటకమని(ఎన్ఎస్సీఎన్-ఐఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. ఆర్.ఎన్. రవి కాలం నాటి నుండి ఇప్పటి వరకు నాగా ప్రజల రాజకీయ, పరిపాలనాపరమైన స్వయంప్రతిపత్తిని పరిష్కరించడంలో కేంద్రం విఫలమైంది. రవి నాగా డిమాండ్లను తొందర పాటుతో అధిగమించడానికి ప్రయత్నించి, రాజ్యాంగ పరమైన ఉమ్మడి సార్వభౌమాధికార సమస్యను పరిష్కరించడంలో విఫలమై తీవ్రమైన నమ్మక లేమిని సృష్టించారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన అనుభవాల నేపథ్యంలో, నాగాలాండ్‌కు రాజ్యాంగపరంగా రక్షణగా ఉన్న ఆర్టికల్ 371ఎ నిబంధనలకు కూడా ఎక్కడ ముప్పు వస్తుందోననే తీవ్రమైన ఆందోళన, భయం నాగా ప్రజల్లో నెలకొంది. ప్రత్యేక జెండా, రాజ్యాంగం లేనిదే నాగా సాంస్కృతిక అస్తిత్వం, స్వయంప్రతిపత్తి పరిపూర్ణం కాదని ముయివా బలంగా నమ్ముతున్నారు. కేంద్రం బల ప్రయోగ విధానాలతో తమ ప్రాథమిక డిమాండ్లను అణచివేయాలని చూస్తే లొంగిపోయే ప్రసక్తే లేదని ఆయన తెగేసి చెప్పారు. సరిగ్గా ఇదే నేపథ్యంలో, ఆగస్టు 14, 2026 నాగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున దిమాపూర్ సమీపంలోని మౌంట్ హెర్మోన్ వద్ద నాగా ఆర్మీకి చెందిన సుమారు 2,500 మంది సాయుధ క్యాడర్లు భారీ పెరేడ్ నిర్వహించడం ద్వారా తమ సైనిక శక్తిని, పట్టును ప్రదర్శించారు. మరోవైపు, మణిపూర్‌లో ప్రస్తుతం ఉన్న అస్థిరతను ఆసరాగా చేసుకుని మయన్మార్‌లోని సాగైంగ్ ప్రాంతంలో ఉన్న తమ శిబిరాలపై దాడి చేయడానికి కేంద్రం కుకీ మరియు పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌లను ఉపయోగిస్తోందని (ఎన్ఎస్సీ-ఎన్ఐఎం)తీవ్ర ఆరోపణలు చేస్తోంది. నాగాలాండ్‌లో

గొల్లపల్లి రిజర్వాయర్‌లో విషాద ఘటన

ఐదుగురు మహిళలు మృతి

మృతులకు మంత్రి సవిత నివాళులు

మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి

పెనుకొండ అక్టోబర్ 16(మనం న్యూస్): పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్కు విహారయాత్రకు వెళ్లి రిజర్వాయర్ లో మునిగి ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెనుకొండ పట్టణం లోని దర్గాపేట ఇసకవంక ప్రాంతానికి చెందిన అశ్విని (23), గాయత్రి (45), పుష్ప (30), మాహిన్ (17), హసీనా(40) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. విహారయాత్ర విషాదాంతంగా మారడంతో బాధిత కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతోషంగా గడపాల్సిన సమయంలో ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మంత్రి సవిత అక్కడికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆనంద్ కుమార్,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, ఇస్లాపురం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి,త్రివేంద్ర నాయుడు,మాధవ నాయుడు, హుజూరుల్లా ఖాన్, దాదు,రియాజ్,బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ అదాలత్లో వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు

కలెక్టరేట్ లో రెండు రోజులపాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతం

ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 16(మనం న్యూస్): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించామని, పెన్షన్ అదాలత్లో వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో బుధవారం, గురువారం రెండు రోజులు పాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతంగా ముగిసిందన్నారు.

ఈ రెండు రోజుల కార్యక్రమంలో 75 పెన్షన్ అథరైజేషన్లు, 111 జీపీఎఫ్ అథరైజేషన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెన్షన్, జీపీఎఫ్, సీఎఫ్ఎంఎస్కు సంబంధించిన 160 ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం అందించినట్లు తెలిపారు. పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ లో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో రోజు గురువారం ఉదయం మరియు మధ్యాహ్నం కూడా అర్జీలను స్వీకరించి అక్కడికక్కడే కొన్నింటికి పరిష్కారం చూపించామని తెలిపారు. ఇక్కడ పరిష్కరించగా మిగిలిపోయిన అర్జీలను అన్నింటినీ విజయవాడకు తీసుకెళ్లామని, వాటిని పూర్తిగా పరిష్కరించే వరకు మానిటర్ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమకు రావాల్సిన ప్రయోజనాలను పొందేలా చూడటంతో పాటు, ప్రస్తుతం సేవలో ఉన్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు.

పెన్షన్ అదాలత్ను మొదటిసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెన్షనర్లు, ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగానికి, పెన్షనర్లకు, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఓటమి భయంతో తాడేపల్లి ప్యాలెస్ నుంచి అల్లర్లకు ఆదేశాలు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని వైసీపీ కుట్రలు
- పార్టీలు మారేవారికి ప్రజలు ఓట్లు పడవు
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, అక్టోబర్ 16 మనంన్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని, తాడేపల్లి కేంద్రంగా అల్లర్లకు కుట్రలు జరుగుతున్నాయని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం విమర్శించారు. పుంగనూరు, రాయచోటి, తిరుపతి, ధర్మవరం లో ఈ రోజు చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను ఎదుర్కొని ప్రజల మద్దతుతో గెలవాల్సిన పార్టీలు దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించినట్లేనని పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు 164 స్థానాలతో కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, ప్రజల మద్దతుతోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో 2020-21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న వివాదాలు, ఆరోపణలు ప్రజలకు గుర్తున్నాయని పేర్కొంటూ, ఈసారి ఎలాంటి హింసకు, అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు ఎవరూ చేసినా అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హింస, బెదిరింపులతో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోలేరు. ప్రజల స్వేచ్ఛాయుత ఓటు హక్కును కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పత్రికా కథనాలకు
స్పందన..

- ఎల్లప్పగూడెం కాలనీకి విద్యుత్ పునరుద్ధరణ
- ఐదు గిరిజన కుటుంబాలకు తొలగిన విద్యుత్ కష్టాలు

కుక్కునూరు, అక్టోబర్ 16(మనం న్యూస్): పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. కుక్కునూరు మండలం దామరచర్ల పంచాయతీ పరిధిలోని ఎల్లప్పగూడెం హామ్లెట్ కాలనీలో ఐదు గిరిజన కుటుంబాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అడవి ప్రాంతం, జామాయిల్ తోట మీదుగా వెళ్లే ఎల్టీ లైన్కు చెందిన 22 స్తంభాల్లో ఒక 8 మీటర్ల స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీలోని ఐదు గిరిజన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈ సమస్యపై పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. కథనాలపై స్పందించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు అక్టోబర్ 16న ఉదయం నుంచే మరమ్మతులు చేపట్టారు. విరిగిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి, దెబ్బతిన్న కేబుల్ను మార్చడంతో అదే రోజు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ వివరాలను జీలుగుమిల్లి డీఈ వెల్లడిస్తూ జంగారెడ్డిగూడెం ఈఈకి నివేదిక సమర్పించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు మోడీ ప్రభుత్వం భయపడదు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 16 : రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పది నెలల్లో మోడీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించేలా రాహుల్ వ్యవహరిస్తున్నారన్నారు. '2029 వరకు ప్రధానిగా మోడీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో చేసినట్లు ప్రభుత్వాన్ని కూల్చుతామని దింపుడుకల్లం ఆశలు పెట్టుకున్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంటే.. భారత్ మాత్రం అభివృద్ధి చెందుతోంది. రాహుల్ గాంధీ తాటాకు చప్పుళ్లకు మోడీ ప్రభుత్వం భయపడదు'' అని చెప్పారు.

యెమెన్ ప్రభుత్వ భవనంపై హూతీల క్షిపణి దాడులు

- మదీనాపై దాడి యత్నం తిప్పికొట్టాం
- సౌదీ అరేబియా కూటమి వెల్లడి
- ఈ దాడికి తాము పాల్పడలేదన్న హూతీలు

సనా/దుబాయి, అక్టోబర్ 16: యెమెన్లో హూతీ తిరుగుబాటుదారులు మరోసారి విరుచుకుపడ్డారు. పోర్టు నగరమైన ఏడెన్లో ఉన్న ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ లక్ష్యంగా క్షిపణి దాడులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడినట్లు సమాచారం. అయితే, ప్రధాన మంత్రి సహా కొందరు మంత్రులు అక్కడే ఉన్న సమయంలో ఈ దాడులు జరిగాయి. ఇందులో పలువురు కీలక నేతలు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. సౌదీ సైనిక కార్యకలాపాల ప్రధాన కార్యాలయాన్ని, ఆయుధ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు హూతీలు ప్రకటించారు. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించడంతోపాటు దట్టమైన పొగ అలముకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

మదీనాపై దాడి యత్నం తిప్పికొట్టాం: సౌదీ

పవిత్ర మదీనా నగరంపై క్షిపణి దాడికి జరిగిన ప్రయత్నాన్ని తిప్పి కొట్టామని సౌదీ అరేబియా నేతృత్వంలోని కూటమి గురువారం వెల్లడించింది. అయితే ఈ దాడికి బాధ్యులెవరన్నది కూటమి పేర్కొనలేదు. మదీనా రాష్ట్రంపై ప్రయోగించిన క్షిపణిని ధ్వంసం చేశామని సౌదీ స్పష్టం చేసింది. ఈ దాడికి తాము పాల్పడలేదని యెమెన్ తిరుగుబాటుదారులైన హూతీలు తెలిపారు. పవిత్ర మక్కా, మదీనా నగరాలపై, వాటి విమానాశ్రయాలపై దాడి చేయబోమని హూతీలు ఇప్పటికే ప్రకటించారు.

ఇరాన్‌పై దాడికి... మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్!

వాషింగ్టన్, అక్టోబర్ 16 : అమెరికా అమ్ములపొదిలో శక్తిమంతమైన సంప్రదాయ ఆయుధం మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ (ఎంవోఏబీ) మరోసారి తెరపైకి వచ్చింది. ఇరాన్ సైనిక, ఇంధన మౌలిక వసతులపై దాడికి సంబంధించి అగ్రరాజ్యం రూపొందించుకుంటున్న అత్యవసర ప్రణాళికల్లో ఈ బాంబు ప్రయోగం కూడా ఉందని కథనాలు వెలువడుతున్నాయి. దీంతో ఆ అస్త్రం వల్ల ఇరాన్కు ఎంత నష్టం కలుగుతుందన్నది చర్చనీయాంశమైంది. పశ్చిమాసియా యుద్ధంలో వ్యూహాత్మక లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు అమెరికాకు ఎంవోఏబీ సరైన ఆయుధమవుతుందా అని నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

ఏమిటీ బాంబు?

ఈ ఆయుధం పేరు జీబీయూ-43/బి మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్ (ఎంవోఏబీ). దీని సామర్థ్యం దృష్ట్యా సరదాగా దీన్ని మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ అని కూడా పిలుస్తారు. దీని బరువు 9.8 టన్నులు. దీన్ని ఆకాశం నుంచి విమానం ద్వారా ప్రయోగిస్తారు. 2003లో ఇరాన్పై యుద్ధానికి ముందు అమెరికా వైమానిక దళ పరిశోధన ల్యాబ్ దీన్ని అభివృద్ధి చేసింది. అమెరికా అమ్ములపొదిలో ఇది అతిపెద్ద అణ్వాస్త్రేతర థర్మోబారిక్ తరహా ఆయుధం.

ఎంవోఏబీను ప్రధానంగా గాల్లో పేలే (ఎయిర్ బ్లాస్ట్) ఆయుధంగా డిజైన్ చేశారు. సాధారణ బాంబులు నేలను తాకి, భారీ బిలాన్ని ఏర్పరుస్తుంటాయి. ఎంవోఏబీ తీరు భిన్నం. ఇది 'ప్రాక్సిమిటీ ఫ్యూజ్' సాయంతో ఇది నేలకు 1.8 మీటర్ల ఎత్తులో పేలిపోతుంది. ఫలితంగా అందులోని 18,700 పౌండ్ల పేలుడు పదార్థం.. కొన్ని మైక్రోసెకన్ల వ్యవధిలోనే భారీగా రసాయన శక్తిని విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఏర్పడే విస్ఫోట తరంగం నేలకు సమాంతరంగా గాల్లో దూసుకెళుతుంది. సంపీడనానికి లోనైన గాలితో కూడిన ఈ భీకర ప్రకంపన తన ప్రయాణ మార్గంలో భవనాలు, వాహనాలు, నేలపై ఉన్న బంకర్లు, రాడార్ కేంద్రాలను ధ్వంసం చేస్తుంది. 1.6 కిలోమీటర్ల వ్యాసంలోని ప్రదేశంలో దీని ప్రభావం ఉంటుంది.

ప్రభావిత ప్రాంతంలో వేగంగా దహనక్రియ జరగడం వల్ల భారీ పరిమాణంలో ఆక్సిజన్ ఖర్చవుతుంది. దీంతో స్థానికంగా శూన్యం ఏర్పడుతుంది. సమీపంలోని గాలి తిరిగి ఆ ప్రదేశానికి దూసుకొచ్చే క్రమంలో బీభత్సం చోటుచేసుకుంటుంది. నేల కిందున్న సొరంగ మార్గాల ప్రవేశాలు కుప్పకూలుతాయి. లోపలున్న సైనికుల ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. పేలుడు వల్ల ఉత్పత్తన్నమయ్యే తీవ్ర వెలుగు, పెను ప్రకంపన, గాల్లోకి ఎగిసే పుట్టగొడుగులాంటి భారీ మేఘం వంటివి ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించడం ఖాయం.

ఎంవోఏబీని తొలిసారిగా 2017 ఏప్రిల్ 13న అఫ్గానిస్థాన్లోని ఐసిస్ ఉగ్రముఠాకు సంబంధించిన సొరంగం, గుహ కాంప్లెక్స్లపై అమెరికా వైమానిక దళం ప్రయోగించింది. దీనివల్ల గుహ ప్రవేశమార్గాలు కూలిపోవడం, ఉగ్రముఠా వద్ద ఉన్న పేలుడు పదార్థాలు విస్ఫోటం చెందడం వంటి పరిణామాల కారణంగా పెను విధ్వంసం జరిగింది. పెద్ద సంఖ్యలో ఐసిస్ తీవ్రవాదులు హతమయ్యారు. నాటి దాడి ఎంవోఏబీ రూపకల్పన ఉద్దేశాన్ని చాటింది. ఉపరితలంపై విస్తరించి ఉన్న నెట్వర్క్ను, తక్కువ లోతు కలిగిన గుహ ప్రాంగణాలు, భారీగా రక్షణ కలిగిన ప్రదేశాలను ధ్వంసం చేయడానికి ఈ బాంబు చక్కగా సరిపోలుతుందని వెల్లడైంది.

ఇరాన్లో నేల ఉపరితలం నుంచి చాలా లోతులో ఉన్న ఫోర్డో, నతాంజ్ వంటి అణు కేంద్రాలను ధ్వంసం చేయడం ఎంవోఏబీకి దాదాపు అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. పైగా ఈ బాంబు పలుచటి అల్యూమినియం తొడుగుతో తయారైంది. గాల్లో విస్ఫోటక శక్తిని పెంచేలా ఇది రూపొందింది. నేరుగా రాయి లేదా కాంక్రీటును తాకితే అది గరిష్ఠ విస్ఫోటం చెందడానికి ముందే విచ్ఛిన్నమవుతుంది. శిలలోకి అది ఎక్కువ లోతుగా చొచ్చుకెళ్లలేదు. ఇరాన్లోని ఫోర్డో అణు ఇంధన శుద్ధి కర్మాగారం 200-300 అడుగుల గ్రానైట్, రీఇన్ఫోర్స్డ్ కాంక్రీటు కింద ఉంది. కొండకు ఎగువన గాల్లో విస్ఫోటం వల్ల రాతి పొరల కిందున్న సెంట్రిఫ్యూజ్ హాల్స్ చెక్కుచెదరవు. చమురు శుద్ధి కర్మాగారాలు, ఎగుమతి టెర్మినళ్లు, విద్యుత్ గ్రిడ్లు, ఇంధన నిల్వ కేంద్రాల ధ్వంసానికి ఎంవోఏబీ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా ఈ బాంబును నెమ్మదిగా కదిలే, స్టెల్త్ లక్షణం లేని రవాణా విమానం (ఎంసీ-130) ద్వారా జారవిడవాలి. ఎస్-300 వంటి గగనతల రక్షణ వ్యవస్థలు కలిగిన ఇరాన్ గగనతలంలోకి ఇలాంటి విమానం వెళ్లడం ప్రమాదకరం.

ఎంవోఏబీకి బదులు జీబీయూ-57ఏ/బీ మాసివ్ ఆర్డినెన్స్ పెనట్రేటర్ (ఎంవోపీ) అనే బాంబుతో అమెరికాకు ప్రయోజనం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. 13 టన్నుల బరువున్న ఈ బాంబును మందపాటి, దృఢ ఉక్కు కేసింగ్తో తయారుచేశారు. ఇది నేలలోకి లోతుగా చొచ్చుకెళ్లి విస్ఫోటం చెందగలదు. 60 అడుగులు మందం కలిగిన రీఇన్ఫోర్స్డ్ కాంక్రీటునూ చీల్చుకెళ్లగలదు. పైగా పటిష్ఠ గగనతల రక్షణ వ్యవస్థలున్న ప్రదేశంలోకి సులువుగా వెళ్లగల బి-2బి స్టెల్త్ బాంబర్ ద్వారా దీన్ని జారవిడవవచ్చు.

ఇది జీపీఎస్/ ఇనర్షియల్ నేవిగేషన్ వ్యవస్థ. గాల్లో ఈ బాంబు ప్రయాణ మార్గాన్ని స్థిరీకరించేందుకు గ్రిడ్ ఫిన్స్కు ఏర్పాటు చేశారు. ఆకాశం నుంచి జారవిడిచే బాంబులను సాధారణంగా యుద్ధవిమానాలు, స్టెల్త్ బాంబర్లలోని అంతర్గత బాంబ్ బేలలో తరలిస్తుంటారు. అయితే ఎంవోఏబీ పొడవు, పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల దాన్ని సంప్రదాయ యుద్ధవిమానాల్లో అమర్చడం కష్టం. ఎంసీ-130 రవాణా విమానం ద్వారా లక్ష్యం వద్దకు తరలించాలి. డ్రాగ్ పారాచూట్ ద్వారా దీన్ని విమానం నుంచి గాల్లోకి జారవిడుస్తారు.

ఎంవోఏబీలో పేలుడు పదార్థం: 18,700 పౌండ్ల హెచ్-6 (ఆర్డీఎక్స్, టీఎన్టీ, అల్యూమినియం పొడితో కూడిన శక్తిమంతమైన పేలుడు పదార్థ మిశ్రమం). పొడవు: 9.1 మీటర్లు, వ్యాసం: 1.03 మీటర్లు ఉంటుంది.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

అమలాపురం, అక్టోబర్ 16(మనం ప్రతినిధి): అమలాపురం రూరల్ భట్నవిల్లి జంక్షన్ నుండి అమలాపురం వై జంక్షన్ వరకు ఉన్న జాతీయ రహదారి బైపాస్ రోడ్డు లో భాగంగా భట్నవిల్లి జంక్షన్ మరియు అమలాపురం వై జంక్షన్ ల వద్ద పార్కింగ్ కు ఎటువంటి అవకాశం లేకపోయినా భారీ వాహనాలు నిలిపి వేస్తూ ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించడం జరుగుతుంది ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటం తో జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహన దారులకు హెచ్చరిక లు చేయడం జరిగింది అయినా మార్పు రాకపోవడం తో ఈ మధ్య కాలంలో అటువంటి వాహనాలపై తనిఖీ లు చేసి జరిమానా కూడా విధించడం జరిగింది. అయినా పూర్తిగా మార్పు రాకపోవడం తో భట్నవిల్లి జంక్షన్, అమలాపురం వై జంక్షన్ (పేరూరు వైపు) అందరికి తెలిసే విధంగా హెచ్చరిక బోర్డు లు పోలీస్, రవాణా, జాతీయ రహదారులు పేరుతో ఏర్పాటు చేశారు.

ఈ ప్రదేశం లో పార్కింగ్ చేస్తే పెద్ద వాహనాలు కు మూడు వేలు రూపాయలు, చిన్న వాహనాలు కు వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధించడం తో పాటుగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావున వాహనాలు నిలపవద్దని తెలుపుతూ హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేశారు.మరి వాహన దారులలో మార్పు వస్తుందో లేదో వేచి చూడాలి..

తాడేపల్లి డైరెక్షన్‌లో వైసీపీ ముఠా అల్లర్లు

- ఓటమి భయంతోనే హింసకు కుట్రలు
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, అక్టోబర్ 16 మన న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో చోటుచేసుకున్న ఘటనలు వైసీపీ హింసా రాజకీయాలకు నిదర్శనమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక, ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులు, ఘర్షణలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లి కేంద్రంగా సాగుతున్న రాజకీయ కుట్రల్లో భాగంగానే స్థానిక ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించాలనే ఆలోచనకు బదులుగా, భయభ్రాంతులకు గురిచేసి ప్రత్యర్థులను ఎన్నికల బరిలోకి దిగకుండా అడ్డుకోవడం వైసీపీకి అలవాటుగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భారీ సంఖ్యలో రౌడీ మూకలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గతంలో నామినేషన్ల దశలోనే ప్రత్యర్థి అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేయడం, అభ్యర్థులపై దాడులకు దిగడం, రిటర్నింగ్ అధికారులను బెదిరించడం వంటి ఘటనలతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించారని విమర్శించారు. 2020-21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయాలను కొనసాగించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

ప్రజల మద్దతుతో గెలుస్తామనే నమ్మకం మాకుంది.. దాడులు చేయాల్సిన అవసరం మాకు లేదు అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో 164 సీట్లతో కూటమి చారిత్రక విజయాన్ని సాధించిందని, ప్రజల ఆశీస్సులతో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల తీర్పును గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కూటమి ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ల పెంపు, దీపం పథకం, అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ బలమని, ప్రజల వద్దకు వెళ్లి తమ పనితీరును వివరించి ఓట్లు కోరుతామని స్పష్టం చేశారు.

వైసీపీ నేతలు ముందుగా ఘర్షణలకు పేరేపించి, అనంతరం బాధితులుగా చిత్రీకరించుకునే రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. ప్రజలను భయపెట్టి, ప్రత్యర్థులను అడ్డుకొని సాధించే విజయం ప్రజాస్వామ్య విజయం కాదని అన్నారు. ఎన్నికల్లో ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే హక్కు, ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉందని, ఆ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేసి, బెదిరింపులు, దాడులు, అక్రమాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని కోరారు.

ఇది గతంలో మాదిరిగా అరాచకాలకు అవకాశం ఇచ్చే పాలన కాదని, రాజ్యాంగం, చట్టాల ప్రకారం నడిచే ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రౌడీయిజాన్ని, ముఠా రాజకీయాలను ప్రోత్సహించే వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గ్రామ స్వరాజ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హింసకు, బెదిరింపులకు తలొగ్గకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

దాడులు, బెదిరింపులు, అల్లర్లతో ప్రజల తీర్పును మార్చలేరు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ప్రజలే అంతిమ నిర్ణేతలు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసేవే కూటమి ప్రభుత్వ అజెండా. స్థానిక ఎన్నికల్లో ప్రజల తీర్పుతో హింసా రాజకీయాలకు, ఫ్యాక్షన్ సంస్కృతికి తగిన సమాధానం లభిస్తుంది అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పష్టం చేశారు.

హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ

శంఖవరం, అక్టోబర్ 16 మనం ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలను కాపాడుకోవాలంటే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు సూచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి సమీపంలోని జాతీయ రహదారిపై నెల్లిపూడి జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించ కుండా, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలు కాకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుం దని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని అవగాహన కల్పించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కాట్రేనికోన, అక్టోబర్ 16 మనం ప్రతినిధి: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి ని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు శుక్రవారం నిశితంగా పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు, వివిధ దస్త్రాలను జాగ్రత్తగా సిబ్బంది సమక్షంలో భద్రపరిచారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని,బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అలసత్వానికి తావీయరాదని సిబ్బందికి సూచించారు.డిప్యూటీ ఎంపీడీఓలు ఎన్ శంకర్ నారాయణ, ఎస్ సూర్య నారాయణ రాజు, పరిపాలన అధికారి ఎం సంఘమిత్ర, మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయంకు కట్టుబడి ఉండాలి

కాట్రేనికోన, అక్టోబర్ 16 మనం ప్రతినిధి: కాట్రేనికోన టిడిపి గ్రామకమిటీ సమావేశం రాష్ట్ర మత్స్య కార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు ఇంటి వద్ద రాష్ట్ర ఆక్వా డైరెక్టర్ విత్తనాల బుజ్జి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగిడి మాట్లాడుతూ రాబోయే జడ్ పి టి సి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అధిష్టానం ఎవరిని నిర్ణయించిన వారి విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కాట్రేనికోన గ్రామ పంచాయతీ పరిధిలో పోటీ చేసే ఎంపిటిసి1, ఎంపిటిసి 2, ఎంపిటిసి 3 స్థానాలకు ఆశావహుల పేర్లు తీసుకున్నారు. ఆశావాహుల లిస్టు మండల అధ్యక్షుడు చెల్లి సురేష్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కివ్వకలో ఘనంగా సరస్వతీ దేవి పూజ.. చిన్నారులకు అక్షరాభ్యాసం

- మూలా నక్షత్రం సరస్వతి దేవి కి విశిష్టమైన రోజు కావడంతో విద్యార్థులకు ప్రత్యేక పూజలు.
- సుమారు 100 మంది విద్యార్థుల హాజరు.. అర్చకులు సాయి ఆధ్వర్యంలో పూజలు, ఉచితంగా పుస్తకాలు, పెన్నుల పంపిణీ

కుక్కునూరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): మండలంలో కివ్వక గ్రామంలో దసరా నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రం సరస్వతి దేవికి విశిష్టమైన రోజు కావడంతో సరస్వతీ దేవి పూజ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విద్య, జ్ఞానానికి ప్రతీక అయిన సరస్వతీ దేవిని ఆరాధిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, ఉచితంగా పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. గురుస్వామి బట్టు వీరబాబు భక్తి, విద్య, సత్ప్రవర్తన ప్రాముఖ్యతను వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

విద్య, విజ్ఞానం, జ్ఞానానికి ప్రతీకగా భావించే సరస్వతీ దేవికి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు సాగాయి.

సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జ్ఞానంతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం.. ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ

సరస్వతీ పూజను పురస్కరించుకుని చిన్నారులకు ఆచార్యులు సాయి అక్షరాభ్యాసం చేయించారు. సంప్రదాయబద్ధంగా అక్షరాలు దిద్దిస్తూ చిన్నారుల విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అనంతరం చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. చిన్నతనం నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, విద్య ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించడంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తి మార్గంలో నడుస్తూ.. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఈ సందర్భంగా గురుస్వామి బట్టు వీరబాబు ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సత్యం, ధర్మం, దయ, మానవత్వం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. దైవభక్తి మనిషిలో మంచి ఆలోచనలు, సత్ప్రవర్తనను పెంపొందిస్తుందని వివరించారు.

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు, వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. సరస్వతీ దేవి ఆశీస్సులతో విద్యార్థులందరూ విద్యారంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రోత్సాహం

సరస్వతీ దేవి పూజతో పాటు అక్షరాభ్యాసం, ఉచిత పుస్తకాలు, పెన్నుల పంపిణీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పారు. గురుస్వామి బట్టు వీరబాబు సందేశం, ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలతో కివ్వక గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. విద్యార్థులు, చిన్నారులకు ప్రోత్సాహం అందించేలా కార్యక్రమం కొనసాగింది.ఈ కార్యక్రమం లో గురుస్వామి బట్టు వీరబాబు, భవానిరాయి కృష్ణార్జునరావు, ఇనుముల గోపరాజు భవాని మాతాలు భక్తులు పాల్గొన్నారు.

చిన తాడేపల్లిలో వైద్యశిబిరం

తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్): తాడేపల్లిగూడెం మండలం చిన తాడేపల్లిలో తెలుగుదేశం పార్టీ నాయకులు గన్నమని అనీల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు రవి కుమార్ ప్రారంభించారు. కార్డియాలజిస్ట్, గైనకాలజిస్ట్, అంకాలజిస్ట్, జనరల్ వ్యాధులకు, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసీజి, టుడిఎకోతోపాటు పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిటికెన శ్రీనివాస్ అత్యంత తాతయ్య, పరిమి వెంకటేశ్వరరావు, గన్నమని రాజేష్, జాస్తి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం కూటమిలో బీసీలకు అన్యాయం

తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్) తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించడం పై టీడీపీ శ్రేణులు, గొరైల శ్రీధర్ అభిమానులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే సీటు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పదవుల్లోనూ జనసేన పార్టీకి ఇచ్చి , టీడీపీకి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా పార్టీలో నెల కొన్న అసంతృప్తి తాజాగా బయటపడింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొరైల శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ పదవి బీసీలకు కేటాయించుకున్న అన్యాయం చేశారని , చైర్మన్ పదవి కేటాయింపు తెలుగుదేశం పార్టీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. , రెండు రోజులు ఆలోచించిపై నిర్ణయాన్ని ఉపసంహరి ంచుకోవాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం సహించేది లేదు!

- పనుల పురోగతిపై మంత్రి నిమ్మల క్షేత్రస్థాయి సమీక్ష

పాలకొల్లు, అక్టోబరు 16, మనం ప్రతినిధి: పాలకొల్లు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. వారానికోసారి పనుల పురోగతిని పరిశీలించే కార్యక్రమంలో భాగంగా గురువారం క్రిష్టియన్ బరియల్ గ్రౌండ్, టిడ్కో గృహాల కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్టీఆర్ కళాక్షేత్రం, అబ్దుల్ కలాం పార్కు, బ్రాడీపేట కొత్త కుళాయి చెరువు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పొట్నూరి శ్రీనివాస్, పొట్నూరి రమేష్ పాల్గొన్నారు.

ముద్దాయిలపై రూ.లక్షకు బైండోవర్ కేసుల నమోదు

పాలకొల్లు, అక్టోబర్ 16,మనం ప్రతినిధి : స్థానిక ఎన్నికల నేపథ్యంలో,పాత ఎక్సైజ్ కేసుల్లోని ముద్దాయిలకు కౌన్సెలింగ్ మరియు .1 లక్షకు బైండోవర్ కేసుల నమోదు శుక్రవారం పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో, ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య ఆధ్వర్యంలో గతంలో నకిలీ మద్యం (,గంజాయి (సుంకం చెల్లించని మద్యం , తదితర కేసుల్లో ఉన్న పాత ముద్దాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.తదుపరి మొత్తం ఏడుగురు(07) పాత ముద్దాయిలకు భవిష్యత్తులో ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా, చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని సూచించారు. అనంతరం వారిని పాలకొల్లు మండల రెవెన్యూ అధికారి ఎదుట హాజరుపరిచి, ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున బైండోవర్ చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య తెలిపారు.అక్రమ మద్యం, గంజాయి మరి యు ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నామినేషన్ల సమయంలో వైసీపీ రౌడీయిజానికి పాల్పడుతోంది

కర్నూలు:అక్టోబర్ 16మనం న్యూస్: పుంగనూరు, రాయచోటి, తిరుపతి ప్రాంతాల్లో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడటంపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్రంగా మండిపడ్డారు. నామినేషన్ల సమయంలో వైసీపీ నేతలు రౌడీయిజానికి పాల్పడుతూ ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పదవుల్లో లేకపోయినా వైసీపీ నేతల తీరు మారలేదని, ఇప్పటికీ అదే దౌర్జన్యకర వైఖరిని కొనసాగిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా నామినేషన్ల సమయంలో టీడీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, గొడవలు సృష్టించడం వైసీపీ నేతల రాజకీయ శైలిగా మారిందని విమర్శించారు.

స్వర్ణాంధ్రలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నరసాపురం, అక్టోబర్ 16 (మనం న్యూస్) : విద్యార్థులు నిత్యం సృజనాత్మక, అధునాతన ఆలోచనలతో తమ మేధస్సుకు పదును పెట్టి విద్యలో రాణించాలని తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అత్యున్నత కొలువులు సాధించాలని అపజయాలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే తమ తమ లక్ష్యాలను సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్, కాకినాడ జేఎన్టీయూ ప్రొఫెసర్ పి ఉదయ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ వి. సందీప్ పిలుపునిచ్చారు. నరసాపురం రూరల్ సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే - 2026 వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి. ఉదయ భాస్కర్, డాక్టర్ వి. సందీప్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలతో పాటు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలను అభినందిస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాసంస్థల చైర్మన్ కె.వి. సత్యనారాయణ, కోశాధికారి కె వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్లు అడ్డాల శ్రీహరి, డాక్టర్ ఎస్. కీర్తి కుమార్, టివివి ప్రసాద్, ఎల్ అప్పారావు, దారపురెడ్డి శ్రీనివాసరావు, ఎం.వి రామచంద్రరావు, గ్రాడ్యుయేషన్ డే కో ఆర్డినేటర్ డాక్టర్ బొమ్మా రామకృష్ణ, వివిధ విభాగాధిపతులు, ఎస్ అండ్ హెచ్ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ వి స్వామినాథన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్ జి ఎన్ విశ్వేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అండ్ ఎన్ సి సి ప్రోగ్రాం ఆఫీసర్ విస్సా మాణిక్యాలరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ వి మణికంఠ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లలో ఎస్సీలకు అవమానం!

- ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న పంచాయతీలే కేటాయించడంపై ఆగ్రహం
- ఎస్సీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్ఆర్సీపి మండల అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి

పోడూరు, అక్టోబరు 16, మనం ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట,పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలోని పోడూరు మండలంలో పంచాయతీ రిజర్వేషన్ల కేటాయింపుల్లో ఎస్సీలకు తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వీరస్వామి తీవ్రంగా విమర్శించారు. మినిమించిలిపాడు, జగన్నాధపురం, అప్పన్నచెరువు, రావిపాడు వంటి ఆర్థిక వనరులు, మరియు ఓట్లు తక్కువగా ఉన్న పంచాయితీలను ఎస్సీలకు కేటాయించడం ద్వారా ఒక రకంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేజర్ పంచాయతీల్లో ఎస్సీలకు అవకాశం ఏదీ?

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పోడూరు, కవిటం, పెనుమదం, గుమ్మలూరు వంటి మేజర్ పంచాయతీలను ఎస్సీలకు కేటాయించి వారి రాజకీయ ఎదుగుదలకు ప్రోత్సాహం అందించామని వీరస్వామి పేర్కొన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎస్సీలను ప్రధాన పంచాయతీలకు దూరం చేస్తూ, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలహీనపరిచేలా రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. ఎస్సీలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వమే వారి ఎదుగుదలకు అడ్డంకిగా మారడం బాధాకరమన్నారు.

రిజర్వేషన్లను పునఃపరిశీలించాలి

ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించామనే పేరుతో ఆర్థికంగా బలహీనమైన పంచాయతీలకే పరిమితం చేయడం సామాజిక న్యాయం అనిపించుకోదని వీరస్వామి అన్నారు. ప్రస్తుత రిజర్వేషన్ల కేటాయింపులను పునఃపరిశీలించి, ఎస్సీలకు ప్రధాన పంచాయతీల్లోనూ రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకొని, వారికి సముచిత న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు: మంత్రి టీజీ భరత్

కర్నూలులో వైసీపీ నాయకుడు రంగాతో పాటు పలువురు టీడీపీలో చేరిక

కర్నూలు అక్టోబర్ 16మనం న్యూస్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో 30వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు రంగా ఆయన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, పలువురు నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే మంచి వ్యక్తులకు మాత్రమే పార్టీలో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండి, ఆ తర్వాత పార్టీకి దూరమైన నాయకులు తిరిగి సొంత గూటికి చేరుతున్నారని పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తాను తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రంగరాజు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మురళి, రవి, బాబు, మల్లికార్జున, రాజశేఖర్ రెడ్డి, తిలక్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, 30వ వార్డు ఇన్చార్జి రాజశేఖర్, బూత్ ఇన్చార్జిలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై దాడులను సహించేది లేదు

మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం , అక్టోబర్ 16,మనం న్యూస్: రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎన్నికల సమయంలో హింసకు పాల్పడటం, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో పుంగనూరు, రాయచోటి ఘటనలపై వైసీపీ తీరును నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ కే.హరి తో కలిసి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ఓటమి భయంతో పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో ప్రత్యర్థులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తాయని అన్నారు.ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం ఉండాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని స్పష్టం చేశారు.

ఎస్ ఐ ని కలసిన ఎంఆర్పీఎస్ నాయకులు

మహానంది, అక్టోబర్16,మనంన్యూస్: మహానంది మండలం నూతన ఎస్ ఐ గా బాధ్యతలు చేపట్టిన శివాంజల్ ను మండల ఎంఆర్పీఎస్ నాయకులు కలసి సన్మానించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ లో నంద్యాల జిల్లా దండోరా అధ్యక్షుడు లక్ష్మణ్, బి సి మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగేషు,బి సి సంక్షేమ సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, ఎస్ సి సెల్ వైస్ ప్రెసిడెంట్ మధు, నాయకులు బాలాజీ, తదితరులు కలసి అభినందనలు తెలిపారు.

స్థానిక ఎన్నికల నామినేషన్

- **నామినేషన్ వేసిన**

సిపిఎం పార్టీ అభ్యర్థులు

బేతంచేర్ల అక్టోబర్ 16 (మనం న్యూస్) పట్టణంలో స్థానిక ఎన్నికల నామినేషన్ లు ప్రారంభం కావడంతో మొదటి రోజు సిపిఎం అభ్యర్థులు నామినేషన్ చేశారు పట్టణంలో 28 వార్డుల లో నిర్వహి స్తున్న స్థానిక ఎన్నికలలో నగర పంచాయతీ కార్యాలయంలో మొదటిరోజు సిపిఎం పార్టీ అభ్యర్థులు నామినేషన్ వేశారు పట్టణంలో 14వ వార్డు ఎస్టి జనరల్ సిపిఎం అభ్యర్థి వై. ఎల్లయ్య 23 వార్డు జనరల్ బిసి సిపిఎం అభ్యర్థిగా లంక సుబ్బరాయుడు నామినేషన్ వేశారు స్థానిక ఎన్నికల నామినేషన్ లు ఎలాంటి అవాంఛనీలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఎస్సై రమేష్ బాబు పోలీస్ సిబ్బంది తో మొదటి రోజు ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయింది

ఎంపీ మిథున్ రెడ్డిపై దాడిని ఖండించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం అక్టోబర్ 16, మనం న్యూస్: చిత్తూరు జిల్లా పుంగనూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజంపేట లోక్సభ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిపై జరిగిన దాడిని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదని ఆయన స్పష్టం చేశారు.ప్రజల చేత ఎన్నికైన ఒక పార్లమెంట్ సభ్యుడిపై, నామినేషన్ ప్రక్రియకు సంబంధించి వెళ్తున్న సమయంలో ప్రత్యర్థులు భౌతిక దాడికి దిగడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరగాలని , ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే, ప్రచారం చేసుకునే రాజ్యాంగ హక్కు ఉందని, ఎన్నికలను శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రతిపక్ష నేతలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన మండిపడ్డారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

మహానంది, అక్టోబర్ 16(మనంన్యూస్): ప్రయివేట్ లాడ్జీలలో అసాంగిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ ఐ శివాంజల్ తెలిపారు. శుక్రవారం ప్రయివేటు లాడ్జీల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మైనర్లకు రూములు ఇవ్వరాదన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రూముల కోసం వచ్చే వారివి తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకొని వారి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహ నిర్మాణానికి 10లక్షల విరాళం

మహానంది, అక్టోబర్16,మనంన్యూస్: మహానంది పుణ్యక్షేత్రం లో భక్తుల కొరకు నంది సదనంలో నిర్మిస్తున్న వసతి గృహ నిర్మాణానికి 10 లక్షల విరాళం దాత అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహనాది కారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాల కు చెందిన గుండె వ్యాధి నిపుణులు వైద్యులుమురళీకృష్ణ, డాక్టర్ తనూజా దంపతులు విరాళాన్ని అందజేశారని తెలిపారు. వీరిని వేదపండితులు రవిశంకర్ అవధాని వేదమంత్రోచ్చారణ మధ్య ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారివెంట సోదరులు డాక్టర్ జయరామకృష్ణ,డాక్టర్ నిత్యా దంపతులతో పాటు ఏ ఈఓ మధు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, తదితరులు వున్నారు.ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వసతి గృహాల నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

ఎన్నికల ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలి

పటిష్ట భద్రత, బారికేడింగ్ ఏర్పాటు చేయాలి
కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

గూడూరు, అక్టోబర్ 16 (మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గూడూరు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనంలో ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్తో కలిసి పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజనం, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. వాహనాల పార్కింగ్, మార్గదర్శక బోర్డులు, స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియం వద, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ ఏ.వి. రమేష్ బాబు, తహశీల్దార్ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎమ్మిగనూరు, అక్టోంబర్ 16(మనం న్యూస్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చిరంజీవి, టౌన్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు

మహాలక్ష్మి దేవిగా కామేశ్వరి అమ్మవారు

మహానంది, అక్టోబర్16,మనం న్యూస్: మహాలక్ష్మి దేవిగా శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రులలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యగశాలలో దాతలు పాల్గొనగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాం బట్,హనుమంతు శర్మల ఆధ్వర్యంలో ఋత్వికులు, అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, దీక్షాధారణ, ఋత్విక్వారున, అఖండ దీప స్థాపన, అగ్నిప్రతిష్టాపన, నవదుర్గ కలశ స్థాపన, తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన నందివాహణం పై కాత్యాయిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మౌళీశ్వర రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీలఖంటేశ్వర రాజు,సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

సి. బెళగల్, అక్టోబర్ 16(మనం న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం సి. బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామంలో హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోడుమూరు సీఐతో కలిసి, సి. బెళగల్ ఎస్ఐ సమక్షంలో పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. గ్రామాల్లోని సమస్యాత్మక ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయం

చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి కార్మికులు ధర్నా

తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మనం న్యూస్): మెడికల్ కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర ఆందోళనలో భాగంగా, ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓ.వి.రాజు ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె లక్ష్మణరావు ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీవో నెం. 138 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు రూ. 18,600/- వేతనం ప్రతి నెల నిర్దిష్ట సమయానికి వేతనాలు జమ చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కరించకపోతే ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రమణమ్మ లక్ష్మి సురేష్ పుష్ప నరసింహ దుర్గ అంజలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం!

- **ప్రతి ఆయకట్టు ఎకరానికి సాగునీరు అందించాలి**

ఎమ్మిగనూరు అక్టోబర్ 16 మనం న్యూస్ పట్టణంలోని ఐఎఫ్టీయూ కార్యాలయంలో నిర్వహించిన రైతుల కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సత్యన్న మాట్లాడుతూ, రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సాగునీటి పంపిణీలో కొంతమంది అధికారులు, కాలువల నిర్వహణ బాధ్యులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కలుగోట్ల-నాగలాపురం ప్రాంతంలోని అంజనేయకు చెందిన పొలాన్ని పరిశీలించారు. సాగునీరు అందక పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. ఇప్పటికే రైతులు ఎకరానికి సుమారు లక్షన్నర రూపాయల వరకు పెట్టుబడి పెట్టి, పంట చేతికి అందుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ దశలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. బాబు, ఐఎఫ్టీయూ ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి ఎం. మల్లికార్జున, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. మునియప్ప, రైతులు అంజనేయ, సాతన్న, హనుమన్న, ఈరన్న, ఉరుకుందు రామాంజనేయులు, స్వాములు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐదో టీ20.. అభిమానులకు బ్యాడ్‌న్యూస్!

టీమిండియా-వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ రసవత్తరంగా సాగుతోంది. లక్నో వేదికగా తొలి టీ20లో భారత్ గెలవగా.. రాంచిలో జరిగిన రెండో రెండో మ్యాచ్ లో కరేబియన్ జట్టు విజయం సాధించింది. అనంతరం ఇండోర్ మూడో మ్యాచ్ జరగ్గా టీమిండియా జయకేతనం ఎగుర వేసింది.

2-2తో సమంగా....

అయితే, హైదరాబాద్ లో బుధవారం నాటి నాలుగో టీ20లో గెలిచి వెస్టిండీస్ ఈ సిరీస్ను 2-2తో సమం చేసింది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య శనివారం జరిగే ఐదో టీ20తో సిరీస్ ఫలితం తేలనుంది. ఇందుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదిక.

ప్రాక్టీస్ సెషన్ రద్దు

కాగా బెంగళూరులో శుక్రవారం భారీగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు కొన్ని నీటమునిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ప్రాక్టీస్ సెషన్ రద్దైపోయింది. ఇక శనివారం సైతం వాన పడే సూచనలు ఉన్నట్లు ఆక్యూవెదర్ తెలిపింది.

వర్షం పడేందుకు 90 శాతం అవకాశం

బెంగళూరులో శనివారం వర్షం పడేందుకు 90 శాతం అవకాశం ఉన్నట్లు ఆక్యూవెదర్ పేర్కొంది. మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం పడేందుకు 11 శాతం, ఆ తర్వాత రెండు గంటల్లో వాన కురిసేందుకు 34 శాతం.. మూడు గంటల తర్వాత ఇందుకు 40 శాతం ఛాన్స్ ఉన్నట్లు తెలిపింది.

కాగా మ్యాచ్ ఏడు గంటలకు మొదలుకానుండగా.. ఆ సమయంలో వర్షం పడేందుకు 64 శాతం అవకాశం ఉందని.. రాత్రి పదకొండు గంటల వరకు కూడా వాన కొనసాగవచ్చని ఆక్యూ వెదర్ అంచనా వేసింది.

నిరాశలో అభిమానులు

దీంతో బెంగళూరులో భారత్- విండీస్ మ్యాచ్ చూద్దామనుకున్న అభిమానులు నిరాశ చెందుతున్నారు. చిన్నదైన చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద చూద్దామనుకుంటే.. వర్షం వల్ల అంతా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని సోషల్ మీడియా వేదికగా ఉసూరుమంటున్నారు.

ఇది మిక్స్‌డ్ జెండర్ క్రికెట్..

ఒకే జట్టులో అమ్మాయిలు, అబ్బాయిలు

టెన్నిస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ.. ఇలాంటి క్రీడల్లో మిక్స్‌డ్ డబుల్స్ అనే పదం ఎక్కువగా వింటాం. పురుష, మహిళా ప్లేయర్లు కలిసి ఒక జట్టుగా బరిలోకి దిగుతారు. ఇప్పుడు క్రికెట్ లోనూ తొలిసారి మిక్స్డ్ జెండర్ మ్యాచులను చూడబోతున్నాం. అదీనూ 80 ఓవర్ల ఫార్మాట్ కావడం గమనార్హం. అందుకు వేదిక శ్రీలంక రాజధాని కొలంబో. సింహాలెస్ స్పోర్ట్స్ క్లబ్ నవంబర్ 14 నుంచి 29 వరకూ 'టెస్టు ట్వంటీ' పేరుతో ఈ టోర్నీని నిర్వహించనుంది.

రెండు బంతులు.. పారిటీ రూల్

- నాలుగు ఖండాల నుంచి 13 నుంచి 21 ఏళ్ల వయసు కలిగిన దాదాపు 160 మందిని టోర్నీ కమిటీ ఎంపిక చేసింది. నాలుగు జట్లుగా విడగొట్టింది.
- ఒకే టీమ్ లో 20 మంది అబ్బాయిలు, 20 మంది అమ్మాయిలు ఉంటారు. ఒకే రోజులో 80 ఓవర్ల మ్యాచ్ ఆడేస్తారు.
- 80 ఓవర్లు అనగానే.. ఒకే జట్టు ఆడేస్తుందేమో అనుకోవద్దు. ఒక్కో టీమ్ 40 ఓవర్లు ఆడుతుంది. కాకపోతే.. రెండుసార్లు బ్యాటింగ్ చేస్తుంది.
- తొలి 20-20 మ్యాచ్ ను రెడ్ బాల్ తో తెల్ల దుస్తులు ధరించి పగలు సమయంలో ఆడతారు. రెండో 20-20 మ్యాచ్ ను తెల్ల బంతితో రంగుల జెర్సీలు ధరించి ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆడాల్సి ఉంటుంది.
- ఈ మ్యాచ్ కు టాస్ అత్యంత కీలకం. టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ లేదా బౌలింగ్ ను ఎంచుకోవడంతోపాటు.. తొలుత బాలికలు ఆడతారా? బాలురు ఆడతారా? అనేది నిర్ణయించుకోవచ్చు.
- మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ లో ప్రత్యేక ఆకర్షణ పారిటీ రూల్. పారిటీ అంటే సమానత్వం. బాల, బాలికలకు సమాన అవకాశాలు ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు చెబుతున్నారు.
- బాల, బాలికల రెండు టీమ్ లూ కలిసి మెరుగ్గా ఆడితేనే విజయం సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. వీరందరూ చేసిన పరుగులను కలిపి తుది ఫలితాన్ని నిర్ణయిస్తారు.

సరిసమానంగా అవకాశాలు..

''టెస్టు ట్వంటీ టోర్నీతో బాలబాలికలకు సమాన అవకాశాలు వస్తాయి. ఇందులో టాస్ కూడా అత్యంత కీలక కానుంది'' అని టోర్నీ వ్యవస్థాపకుడు గౌరవ్ భిర్వాని తెలిపారు. టోర్నమెంట్ కు సంబంధించి అడ్వైజరీ బోర్డులో ఏబీ డివిలియర్స్, మాథ్యూ హేడెన్, సర్ క్లైవ్ లాయిడ్ ఉన్నట్లు పేర్కొన్నారు. గ్లోబల్ సెలక్షన్ కమిటీ అధ్యక్షుడిగా దిల్లీ కోచ్ రాజ్ కుమార్ శర్మ, టోర్నీ కార్యకలాపాలకు మైక్ ఫోర్డమ్ నాయకత్వం వహిస్తారు.

బౌలర్లనేమీ అనలేం.. బ్యాటర్లదే బాధ్యత

భారత బ్యాటర్లు ఛేదనలో మరింత బాధ్యతగా ఆడాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ సూచించాడు. వెస్టిండీస్తో నాలుగో టీ20లో టీమ్ఇండియా 24 పరుగుల తేడాతో పరాజయంపాలైన నేపథ్యంలో ఆయన ఇలా అన్నాడు. బ్యాటింగ్కు బాగా అనుకూలించే హైదరాబాద్లాంటి పిచ్ భారత బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించాల్సిందని చెప్పాడు. ''టీమ్ఇండియా ప్రధానంగా ఛేదనలో మెరుగవ్వాలి. బ్యాటింగ్ విభాగం మరింత బాధ్యతాయుతంగా ఆడాలి. లేదంటే భారత్ విజయం సాధించడం కష్టమవుతుంది. బ్యాటింగ్కు స్వర్గధామంలాంటి ఉప్పల్లో మన బ్యాటర్లు మరింత చెలరేగాల్సింది. సంజు శాంసన్ గొప్ప ఆరంభం అందించినా.. భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆరంభంలో అభిషేక్ తన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడకపోవడం దెబ్బతీసింది. కీమో పాల్ బిగించిన ఉచ్చుకు ఇషాన్ కిషన్ తేలికగా చిక్కాడు. తొలి మ్యాచ్లో సెంచరీ తర్వాత శ్రేయస్ అయ్యర్ నుంచి పెద్ద ఇన్నింగ్స్ రాలేదు'' అని గావస్కర్ పేర్కొన్నాడు. అయితే టీమ్ఇండియా బౌలర్లను మాత్రం నిందించలేమని అతడు చెప్పాడు. ''మన బౌలర్ల ప్రదర్శన పేలవమని అంగీకరిస్తా.

నా మనసుకు నచ్చిందే చేస్తాను - అనీత్ పడ్డా

'సైయారా' లాంటి బ్లాక్ బస్టర్ విజయం తర్వాత యంగ్ హీరోయిన్ అనీత్ పడ్డా మ్యాడ్డాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో తెరకెక్కుతున్న 'శక్తి షాలిని' చిత్రంతో సిద్ధమవుతోంది. ప్రేక్షకులను మునుపెన్నడూ చూడని పవర్ ఫుల్ అండ్ గ్లామరస్ అవతారంలో ఆమె అలరించేందుకు శరవేగంగా జరుగుతున్న సమయంలో.. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అనీత్ పడ్డా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ చిత్రంలో తన పాత్ర గత రొమాంటిక్ బ్లాక్ బస్టర్ కు పూర్తిగా భిన్నంగా ఉంటుందని తెలిపింది. మొదటి సినిమా తెచ్చిన విజయం వల్ల ప్రేక్షకుల నుంచి ఎన్నో అంచనాలు ఉంటాయని, కానీ తాను ఎప్పుడూ తలకు ఎక్కించుకోలేదని స్పష్టం చేసింది. ఒత్తిడికి భారాన్ని తాను ఎప్పుడూ తలకు ఎక్కించుకోలేదని స్పష్టం చేసింది. ఒత్తిడికి గురికాకుండా కేవలం నటనపైనే పూర్తి దృష్టి పెట్టానని చెప్పింది. మార్కెట్ లెక్కింపుల కోసమో కాకుండా, నటిగా తనకు సృజనాత్మక సంతృప్తిని ఇచ్చే పాత్రలకే ఓటు వేస్తానని తెలిపింది. ప్రజల అంచనాల కోసం తాను బతకనని.. తన మనసుకు నచ్చిందే చేస్తానని స్పష్టం చేసింది. 'శక్తి షాలిని' షూటింగ్ ప్రారంభంలో నర్వస్ భారం ఉంటుందేమోనని అనుకున్నానని.. కానీ సెట్ లోకి అడుగుపెట్టాక ఆ ఆలోచన పోయిందని అనీత్ పేర్కొంది. 'శక్తి షాలిని' కథలో యాక్షన్, రొమాన్స్, హారర్ ఎలిమెంట్స్ అన్నీ ఉండటం తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చిందని చెప్పింది. ముఖ్యంగా కెరీర్ రెండో సినిమాకే కథను తన భుజాలపై మోసే రోల్ దక్కడం నిజంగా అదృష్టమని, దీని ఫలితం ఎలా ఉన్నా పూర్తి బాధ్యత తనదేనని పేర్కొంది.

ఆ స్థాయికి రావడమే నా జీవితంలో అసలైన విజయం: సాయి పల్లవి

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి త్వరలోనే 'రామాయణ' వంటి అత్యంత భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రం రాబోయే దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్లో భాగంగా సాయి పల్లవి తాజాగా 'జయమ్ము నిశ్చయమ్మురా సీజన్-2' టాక్ షోలో పాల్గొని, తన కెరీర్ తొలినాళ్లలోని చేదు తీపి అనుభవాలను పంచుకున్నారు. నటుడు జగపతి బాబు హోస్ట్ గా వ్యవహరిస్తున్న ఈ షోలో.. 'మీ జీవితంలో జయమ్ము నిశ్చయమ్మురా అనిపించిన ప్రత్యేక సంఘటన ఏది?' అని సాయి పల్లవిని ప్రశ్నించారు.

దానికి ఆమె రియాక్ట్ అవుతూ.. తన డాన్స్ కెరీర్ ప్రారంభంలో ఒక ప్రముఖ డాన్స్ రియాలిటీ షో వేదికపై ఓడిపోయానని, కానీ సరిగ్గా అదే స్టేజ్ కొన్నాళ్ల తర్వాత ప్రభుదేవా మాస్టర్ కొరియోగ్రఫీలో తాను 'రౌడీ బేబీ' పాటకు డాన్స్ చేయడం జీవితంలో మర్చిపోలేని మలుపు అని చెప్పారు. ఓటమి ఎదురైన చోటే తనను తాను నిరూపించుకుని, అంతటి గొప్ప స్థాయికి చేరుకోవడాన్ని తన నిజమైన విజయంగా భావిస్తానని ఆమె తెలిపారు. కేవలం అదృష్టం ఉంటేనే విజయం వస్తుందంటే తాను నమ్మనని సాయి పల్లవి స్పష్టం చేశారు. మనం పడే కష్టమే మనల్ని సరైన స్థానంలో నిలబెడుతుందని, కష్టపడి పనిచేస్తే సక్సెస్ అనేది వెతుక్కుంటూ ఆటోమేటిక్గా వస్తుందని చెప్పారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని సాయి పల్లవి వెల్లడించారు.

పురుషులు నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోండి.. - స్వరా భాస్కర్

బాలీవుడ్ బ్యూటీ స్వరా భాస్కర్ సినిమాలకు దూరమైనప్పటికీ 'రైజ్ అండ్ ఫాల్' అనే క్రేజీ రియాలిటీ షోలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. తన మూడేళ్ల కూతురితో ఎక్కువ సమయం గడపడానికి రియాలిటీ షోలే బెస్ట్ ఆప్షన్ అని స్వరా భాస్కర్ స్పష్టం చేశారు. సినిమాల్లో నటిస్తే ఎక్కువ రోజులు క్యారెక్టర్ మూడ్లోనే ఉండిపోవాల్సి వస్తుందని, కానీ రియాలిటీ షోలు అయితే తక్కువ సమయంలో పూర్తయి పాపతో ఉండేందుకు వీలవుతుందని ఆమె వెల్లడించారు. అలాగే తన నిజమైన వ్యక్తిత్వాన్ని చూపించడానికి ఇది మంచి ప్లాట్ ఫామ్ గా ఉపయోగపడతాయని అన్నారు.

ఇక ప్రసవం తర్వాత తనపై వస్తున్న ట్రోల్స్, బాడీ షేమింగ్ పై స్వరా భాస్కర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తల్లులయ్యే మహిళల శరీర ఆకృతిపై దారుణమైన కామెంట్లు చేసేవారికి కనీస మానవత్వం, తెలివితేటలు ఉండవని మండిపడ్డారు. ఐశ్వర్య రాయ్, కత్రినా కైఫ్ వంటి స్టార్లను కూడా ఇలాగే టార్గెట్ చేశారని గుర్తుచేస్తూ.. సన్నగా ఉండటంలోనే సౌందర్యం లేదని, ఆరోగ్యంగా ఉండటమే ముఖ్యమని తేల్చి చెప్పారు. ముఖ్యంగా మహిళల శరీరాలపై ఉచిత సలహాలు, కామెంట్లు ఇచ్చే మగవాళ్లు తమ నోళ్లు మూసుకొని ఇంట్లో కూర్చోవాలని స్వరా ఘాటుగా హెచ్చరించారు.

బాడీ డబుల్స్ వద్దన్న హీరోయిన్

ఓటీటీలో విడుదలైన సంచలన సెన్సేషనల్ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకుడు విశాల్ భరద్వాజ్ తెరకెక్కించిన ఈ సిరీస్ లో రియల్ లైఫ్ కపుల్ అయిన అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ జంటగా నటించారు. ఈ నేపథ్యంలో దర్శకుడు విశాల్ భరద్వాజ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వీరిద్దరితో పనిచేసిన అనుభవం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నిజ జీవితంలో అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ లు భార్యభర్తలు అయినప్పటికీ.. కెమెరా ముందు మాత్రం వారు ఆ బంధాన్ని ఎక్కడా ప్రదర్శించలేదని విశాల్ భరద్వాజ్ తెలిపారు. 'సెట్ లో వారిద్దరి మధ్య ఉన్న బంధం వల్ల కొంత ఇబ్బంది తలెత్తిపోయిన మాట వాస్తవమే. అయితే, వారిద్దరి మధ్య కెమిస్ట్రీని చూసినప్పుడు నాకు మాత్రం వారు నిజజీవితంలో భార్యాభర్తలనే భావనే ఎప్పుడూ కలగలేదు. నటులుగా వారు పూర్తిగా పాత్రల్లో లీనమైపోయి జీవించారు' అని ఆయన పేర్కొన్నారు.



బాడీ డబుల్ ను తిరస్కరించిన జంట..

ఈ చిత్రంలోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాల కోసం మేకర్స్ బాడీ డబుల్ ను సిద్ధం చేసినప్పటికీ.. అదితి, సిద్ధార్థ్ వాటిని ఉపయోగించడానికి నిరాకరించినట్లు విశాల్ భరద్వాజ్ వెల్లడించారు. ఒక నిర్దిష్టమైన సన్నివేశంలో షాట్ గురించి మాట్లాడేటప్పుడు, ''నా కాళ్లు అంత లావుగా లేవు'' అంటూ అదితి స్వయంగా ఆ సీన్ లో నటించడానికి ముందుకు వచ్చారని, అలాగే సిద్ధార్థ్ కూడా తన వెర్షన్ ను ఎంతో నిబద్ధతతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేశారని ఆయన ప్రశంసించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావు, శకున్ బత్రాలతో పాటు విశాల్ భరద్వాజ్ సంయుక్తంగా తెరకెక్కించిన ఈ ఆంథాలజీ ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది.

4,000 కోట్ల విజన్ ను ఎగతాళి చేయడం సరికాదు.. : యష్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విజువల్ వండర్ లో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా కేజీఎఫ్ స్టార్ యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, మండోదరిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న యష్.. సినిమాపై సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివిటీకి, విమర్శలకు తనదైన శైలిలో గట్టి సమాధానమిచ్చారు. సుమారు నాలుగు వేల కోట్ల భారీ విజన్ తో తెరకెక్కుతున్న ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్ కు అందరి మద్దతు, మంచి ఆశయం అవసరమని, అంతేకానీ సోషల్ మీడియాలో నిత్యం ఎగతాళి చేయడం సరికాదని ఆయన అన్నారు.

సినిమాపై నిర్మాణాత్మక విమర్శలు ఉండవచ్చు కానీ, అసలు మూవీని చూడకుండానే ముందుగానే దాన్ని తప్పుబట్టడం సమంజసం కాదనిస్పష్టం చేశారు. భారతీయ సినిమాను గౌరవించాలని యష్ పిలుపునిచ్చారు. ఇక తన గత చిత్రం 'టాక్సిక్' గురించి మాట్లాడుతూ.. అన్ని అడ్డంకులను ఎదుర్కొని ప్రేక్షకులు ఆ సినిమాను ఎన్నోసార్లు చూసి, భారీ కలెక్షన్లతో దానిని ఎంతగానో ప్రేమించారని, ఆదరించారని గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. తను కూడా ఒక నిర్మాతగా వ్యవహరిస్తున్నానని, ఈ 'రామాయణం' కూడా కర్ణాటక ఉత్పత్తి అని గర్వంగా చెబుతున్నానని యష్ పేర్కొన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.